జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండలం రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 8 ఏప్రిల్ 2026 | సంపుటి : 16 | సంచిక : 255 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో 'పేలు' మాదిరిగా ఏరిపారేశారు



- మతువా, మైనారిటీలకు చెందిన ఓట్లను ఈసీ తొలగించింది
- సుప్రీంకోర్టులో వాదనలు వినిపించడంతో 32 లక్షల పేర్లను తిరిగి జాబితాలో చేర్చింది
- బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కీలక వ్యాఖ్యలు

2



## మతవిశ్వాసం న్యాయ సమీక్షకు అతీతం

- శబరిమలలో మహిళలపై ఆంక్షలను సమర్థించిన కేంద్రం
- శబరిమలలో రుతుస్రావం అయ్యే వయసు గల మహిళల ప్రవేశంపై ఆంక్షలను సమర్థించిన కేంద్ర ప్రభుత్వం
- ఈ మేరకు సుప్రీంకోర్టును తమ వైఖరిని వెల్లడించిన సర్కార్

2



## కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర

- ప్రచారానికి చివరి రోజున కావడంతో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం
- కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఏప్రిల్ 9న జరగనున్న పోలింగ్
- మే 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు
- ఏప్రిల్ 9న అసోంలో పోలింగ్ జరగనుండగా మొత్తం 126 స్థానాల్లో బరిలోకి దిగిన 722 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది

2



### రేవంత్.. మళ్లీ గెలవడం కాదు..

## సింగిల్ డిజిటే మీకు

- రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవ్వడం ఖాయం
- ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?
- రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన... బేడీల పాలన గుడ్డి పాలన
- సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండి.

3

# విస్తరణ పక్కా!

- అందరి దృష్టి కేబినెట్ విస్తరణ అంశంపైనే కేంద్రీకృతమైంది.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు
- ఎవరికి ఉద్వాసన పలుకుతారు అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది
- ప్రస్తుతం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఈ కసరత్తు మే నెల వరకు వాయిదా పడే అవకాశాలు



హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అందరి దృష్టి కేబినెట్ విస్తరణ అంశంపైనే కేంద్రీకృతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు, ఎవరికి ఉద్వాసన పలుకుతారు అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఈ కసరత్తు మే నెల వరకు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం మొత్తం ఈ ఎన్నికలపైనే దృష్టి సారించడంతో తెలంగాణలో మార్పులకు ముహూర్తం ప్రస్తుతానికి దూరమైంది. - మిగతా3లో

## బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలుసు

- పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు పర్యవసానాలను అనుభవించారని రాజ్‌నాథ్ ఎద్దేవా
- రెండు పొరుగుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌కు వార్నింగ్
- "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు

2



## తెలంగాణ మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారింది



- తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో డీజీపీ శివధర్‌రెడ్డి పర్యటన
- వెంకటాపురం మండలం పాముసూరులో పోలీస్ ఔట్ పోస్టుకు శంకుస్థాపన
- కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమన్న డీజీపీ శివధర్ రెడ్డి
- ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకం

హైదరాబాద్

తెలంగాణ మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. రాష్ట్రం నుంచి ఆరుగురు వ్యక్తులు ఉద్యమంలో ఉన్నారని, వారు కూడా బయటకు రావాలని కోరుతున్నామన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టలు ప్రాంతం చాలా కాలం పాటు అభివృద్ధికి దూరమైందన్నారు. గూడేల్లో ఉన్నవారికి కనీస సౌకర్యాలు అందలేదన్నారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని తెలిపారు. ప్రభుత్వం తరఫునుంచి పరిశ్రమలు ఏర్పాటుకు - మిగతా3లో

# చర్చకు సిద్ధం

## తెలంగాణ అభివృద్ధిపై పరిశీలించుకోవచ్చు

- తెలంగాణలో కేసీఆర్‌ను ఎలా మార్చారో, కేరళంలో కూడా విజయన్‌ను మార్చేస్తారు
- కేరళం రాష్ట్రంలోని కోవలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- కేరళం సీఎం పినరయి విజయన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన రేవంత్ రెడ్డి
- పినరయి విజయన్ కేరళం ప్రజలను మోసం చేస్తున్నారు
- ఒక మోదీ ఢిల్లీ నుంచి పాలిస్తే మరో మోదీ తిరువనంతపురం నుంచి పాలిస్తున్నారు
- కేరళంలో విజయన్ మోదీలా పాలిస్తున్నారన్నారు
- ఓట్ల కోసం మోదీలానే విజయన్ తన పేరుతో ప్రచారం చేస్తున్నారు



హైదరాబాద్

కేరళం సీఎం పినరయి విజయన్ తన 120 నెలల పాలనలో పూర్తిగా విఫలమయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేరళంలో సరైన అవకాశాలు లేక యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కేరళంలో వృద్ధులు, చిన్నపిల్లలే ఎక్కువగా కనిపిస్తున్నారని తెలిపారు. విద్యావంతులు నైపుణ్యం కలిగిన యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్న ఆయన వాళ్లు తిరిగొచ్చి ఉపాధి పొందేలా చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మాదిరి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం లాంటివి కేరళంలో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చని పినరయి - మిగతా3లో



## రేవంత్ రెడ్డిపై కేరళ సీఎం ఘాటు విమర్శలు

- తీవ్ర పరుష పదజాలంతో?!
- రేవంత్ రెడ్డికి కేరళ సీఎం విజయన్ కౌంటర్
- సీఎం హోదాలో అలా మాట్లాడొచ్చా అని విజయన్ ప్రశ్న

2



## చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ!

- రాహుల్ బాబా విను- బీజేపీ అధికారంలోకి రాగానే
- దేశం నుంచి చొరబాటుదారులను వెనక్కి పంపిస్తాం
- బంగాల్, అసోం, త్రిపురల్లో చొరబాటుదారులు పెరిగేందుకు కాంగ్రెస్ సహకారం
- బీజేపీ అధికారంలోకి రాగానే వాళ్లను పంపిచేస్తాం
- స్పష్టం చేసిన అమిత్ షా

2

# బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలుసు

కోల్‌కతాపై దాడి చేస్తామంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్?కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు పర్యవసానాలను అనుభవించారని ఎద్దేవా చేశారు. కాబట్టి ఆయన అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయకూడదని సూచించారు. వారు బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో ఆ దేవుడికే తెలుసని వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు. 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు దాని పర్యవసానాలను అనుభవించారు. వారు ఇప్పుడు బంగాల్?పై కన్నేస్తే, ఈసారి పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో దేవుడికే తెలియాలి." ఈ క్రమంలోనే 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్? రెండుగా విడిపోయిన విషయాన్ని రాజ్?నాథ్? ప్రస్తావించారు. 1971లో జరిగిన యుద్ధంలో తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. ఆ సమయంలో బంగ్లాదేశ్‌కు భారత సైన్యం అండగా నిలిచింది. అప్పట్లో పాక్ ఎన్నో పర్యవసానాలు ఎదుర్కొందని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా రెండు పొరుగుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌కు వార్నింగ్ ఇచ్చారు.



### కేంద్రంపై టీఎంసీ ఫైర్?

మరోవైపు ఈ ఘటనపై టీఎంసీ కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసింది. కోల్‌కతాపై దాడి చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగా బెదిరించడాన్ని ఖండించే ధైర్యం లేదని ఆరోపించింది. ఎన్నికల సభలో మాట్లాడిన ఎంపీ అభిషేక్ బెనర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "56 అంగుళాల ఛాతీ గల ప్రధానమంత్రి, ఆయన హోం మంత్రి ఓట్ల ప్రచారంలో ఎంతగా మునిగిపోయారంటే బంగాల్‌పై జరుగుతున్న ప్రత్యక్ష దురాక్రమణ బెదిరింపులకు స్పందించడానికి వారికి సమయం లేదు. పాకిస్థాన్ రక్షణ మంత్రి కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించారు. అయినా భారత యూనియన్‌లోని ఒక రాష్ట్రంపై, సార్వభౌమాధికారంపై జరిగిన ఈ ఘోరమైన దాడిని ఖండించే ధైర్యాన్ని నరేంద్ర మోదీకీ, అమిత్ షా గానీ లేదు. వారికి బంగాల్ ప్రజల ప్రాణాలు ఏమాత్రం లెక్కలేనట్టుగా ఉన్నాయి. వీరిద్దరు చాలా పిరికివాళ్లు. వారికి కనీసం కొద్దిపాటి ధైర్యం ఉన్నా, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్‌కు, భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. నరేంద్ర మోదీకి ఆ ధైర్యం ఉందా? అమిత్ షాకు ఆ ధైర్యం ఉందా? రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ ధైర్యం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

### పాకిస్థాన్ రక్షణ మంత్రి పిచ్చి ప్రేలాపనలు

కాగా కొద్ది రోజుల క్రితం భారత్‌పై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి నోరుపారేసుకున్నారు. భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పిచ్చి ప్రేలాపనలు చేశారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ అక్కసు వెళ్లగక్కారు. అయితే, తన వాదనలకు బలం చేకూర్చేలా ఖవాజా, ఎటువంటి ఆధారాలూ ఇవ్వకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం ఘటన జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తమపై జరిగే దాడులను తిప్పికొడతామని ఖవాజా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.

# చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ!

అసోం ఎన్నికల ప్రచారంలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్‌పై, రాహుల్ గాంధీపై విమర్శల వర్షం కురిపించారు. అసోంను చొరబాటుదారుల ఆధిపత్య ప్రాంతంగా మారనివ్వమని ఆయన తేల్చిచెప్పారు. అసోంలోని పథర్‌కండిలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న అమిత్ షా, ప్రతిపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రాహుల్ బాబా ఇది స్పష్టంగా విను. అసోంను చొరబాటుదారుల అడ్డాగా మారనివ్వం. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం విపక్షాలు ఇన్నాళ్లు చొరబాటుదారుల పట్ల ఉదాసీనంగా ఉన్నాయి. ఇప్పటికే చొరబాటుదారులను గుర్తించాం. బీజేపీ అధికారంలోకి రాగానే వారిని ఒక్కొక్కరిగా ఏరిపారేస్తాం."



### చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ!

'సీఏఏ గురించి మాట్లాడినప్పుడల్లా కాంగ్రెస్? అడ్డుకుంటోంది. కుట్రపూరితంగా ఈ ప్రాంతాన్ని చొరబాటుదారుల జోన్‌గా మార్చాలని వారు చూశారు. 1950 నాటి వలసదారుల బహిష్కరణ చట్టాన్ని రద్దు చేసి, 1983లో ఐఎండీటీ చట్టాన్ని తీసుకువచ్చారు. తద్వారా చొరబాటుదారులకు రక్షణ కల్పించారు. అసోం, బంగాల్, త్రిపురల్లో బీజేపీ–ఎన్?డీఏ ప్రభుత్వాలు ఉంటేనే ఈ అక్రమ చొరబాటులు పూర్తిగా ఆగుతాయి. తద్వారా స్థానికులకు ఉద్యోగాలు, రేషన్?, జీవనోపాధి కలుగుతాయి' అని అమిత్? షా అన్నారు.

### మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై ఆగ్రహం

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల గుజరాత్‌ను నిరక్షరాస్యుల ప్రాంతంగా అభివర్ణించడాన్ని అమిత్ షా తీవ్రంగా ఖండించారు. "దయానంద సరస్వతి, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ బాయి పటేల్?, విక్రమ్ సారాభాయ్, ప్రధాని నరేంద్ర మోదీ లాంటి మహానుభావులను అందించిన గుజరాత్?ను నిరక్షరాస్యులని పిలవడానికి మీకు ఎంత ధైర్యం? ఇలా అన్నందుకు కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలి" అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే 'ఆర్?ఎస్?ఎస్?ను, బీజేపీలను పాములు అని, వాటిని చంపాలి' అని ఖర్గే చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. 'ఖర్గే, ఈ వేదికపై వచ్చి చుట్టూ చూడండి. వేలాది మంది బీజేపీ, ఆర్?ఎస్?ఎస్? సభ్యులు మీ ముందే ఉంటారు' అని పేర్కొన్నారు. మరోవైపు రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకత్వం చేపట్టినప్పటి నుంచి, ఆ పార్టీ నేతల బహిరంగ ప్రసంగాలు, ప్రమాణాలు పడిపోయాయని షా అన్నారు.

### బంగాల్‌లో పరివర్తన ఖాయం

ఇక బంగాల్‌లో ఈసారి 'పరివర్తన' (మార్పు) అనివార్యమని అమిత్ షా పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే, చొరబాటుదారులందరినీ, వారి దేశాలకు తిరిగి పంపిస్తామని ఆయన ప్రకటించారు. అసోంలోని పాతార్?కండిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అసోం బరాక్? వ్యాలీలో కాంగ్రెస్ అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించిందని, తద్వారా శ్రీభూమి, సిల్చార్?, కాచార్ జిల్లాలలో వారి ప్రాబల్యం పెరిగేలా చేసిందని ఆయన ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలులోకి వస్తే, అక్రమ చొరబాటుదారులు ఎవ్వరూ రాష్ట్రంలో ఉండలేరని తెలిసి, కాంగ్రెస్ దానిని వ్యతిరేకిస్తోందని ఆయన విమర్శించారు. ఇక అసోంలోని 'జాతి' (సమాజం), 'మాటి' (భూమి), 'భేటీ' (పునాది)లను రక్షించడానికి బీజేపీ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూ, ప్రాంతీయ భావాలపై ఆయనకు ఉన్న అవగాహనను అమిత్? షా ప్రశ్నించారు. కరీంగంజ్? పేరును బీజేపీ శ్రీభూమిగా మార్చిందని ఆయన గుర్తు చేస్తూ, ఇటలీ మూలాలు ఉన్నవారికి ఈ పేరు మార్పు ప్రాముఖ్యత గురించి ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ అస్సామీ, బంగాలీ భాషలకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా కల్పించారని ఆయన పేర్కొన్నారు. కాగా, అసోం అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 9న ఒకే దశలో జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు 2026 మే 4న వెలువరించనున్నారు.

# కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర

కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ నేతల ప్రసంగాలు, భారీ బహిరంగ సభలు, రోడ్ షోలతో మారుమోగిన మైకులు ఈ సాయంత్రం 5 గంటల తర్వాత మూగబోయాయి. ప్రచారానికి చివరి రోజున కావడంతో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. కేరళలో యా.ఐ.ఫ్రీ, ఖణఫ్రీ పరస్పరం విమర్శలు గుప్పించుకున్నాయి. అసోంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రచార హోరు వాడివేడిగా జరిగింది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగింది.



### అసోంలో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

అసోం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ప్రచారం ఆఖరి రోజున ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులను ప్రోత్సహించిందని, రాష్ట్ర అభివృద్ధికి నిరోధకంగా మారిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బహుభార్యాత్వాన్ని నిరోధించడానికి ఉమ్మడి పౌరస్మృతి–ఖజజ అమలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. తమ పాలనలో బాల్య వివాహాలను 84 శాతం తగ్గించామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు.

మరోవైపు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రతిపక్ష కూటమి తరపున జోరుగా ప్రచారం చేశారు. బీజేపీ ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని, సీఎం, ఆయన కుటుంబ సభ్యులు భారీ అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ ఆరోపించింది. తాము అధికారంలోకి వస్తే మహిళలకు నగదు సాయం, ఆరోగ్య బీమా, స్థానిక ప్రజలకు భూమి హక్కులు కల్పిస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. ఏప్రిల్ 9న అసోంలో పోలింగ్ జరగనుండగా మొత్తం 126 స్థానాల్లో బరిలోకి దిగిన 722 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గతంలో పలు విడతలుగా జరిగిన ఎన్నికలకు భిన్నంగా, ఈసారి అసోంలో కేవలం ఒకే దశలో పోలింగ్ జరగనుంది.

### ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్న ప్రధాన పార్టీలు

కేరళంలో ఇండియా కూటమి, యా.ఐ.ఫ్రీ ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నాయి. అభివృద్ధి, అవినీతి అంశాలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సందించుకున్నాయి. ఈ ఎన్నికల్లో కేరళలోని 140 స్థానాలకు 883 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అటు దాదాపు 2.42 లక్షల మందికి పైగా విదేశీ ఓటర్లు ఉన్నారని ఈసీ తెలిపింది. కాగా, ఈ ఎన్నికల్లో ప్రధానంగా యాణఫ్రీ, ఖణఫ్రీ, చీణాూ కూటముల మధ్య పోటీ నెలకొంది.

### పుదుచ్చేరిలో జోరుగా ప్రధాన పార్టీల ప్రచారం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగింది. పుదుచ్చేరిలోని 30 స్థానాలకు 294 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధానంగా ఎన్డీఏ– ఇండియా కూటమికి మధ్య పోటీ నెలకొంది. పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాం ప్రాంతాలలో కలిపి అసెంబ్లీలో ముప్పై సీట్లు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 9,48,977 మంది ఓటర్లు ఉండగా, అందులో 4,45,761 మంది పురుషులు, 5,03,076 మంది మహిళలు, 140 మంది ట్రాన్స్?జెండర్లు ఉన్నారు.

### మే 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు

ప్రస్తుతం 5 రాష్ట్రాల్లో ఈసీ ఎన్నికలు నిర్వహిస్తోంది. తొలి విడతలో కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఏప్రిల్ 9న ఎన్నికలు నిర్వహించనుండగా తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. ఇక బంగాల్‌లో 2 విడతలుగా ఓటింగ్ జరగనుంది. తొలి విడత ఏప్రిల్ 23న, రెండో విడత 29న నిర్వహించనున్నారు. ఎన్నికల ఫలితాలను మే 4న వెలువడనున్నాయి.

## ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో 'పేలు' మాదిరిగా ఏరిపారేశారు

ఓట్ల తొలగింపుపై బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత మతువా, మైనారిటీలకు చెందిన ఓట్లను ఈసీ తొలగించిందని ఆరోపించారు. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర దినాజ్‌పుర్ వంటి గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న జిల్లాల్లో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో పేల మాదిరిగా ఏరివేస్తున్నారని మమతా ఆరోపించారు. అయితే, ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించిన వారి పక్షాన టీఎంసీ న్యాయ పోరాటం చేస్తుందని ఆమె తెలిపారు. ఈ విషయంపై తాము సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించడంతో దాదాపు 32 లక్షల పేర్లను ఈసీ ఓటరు జాబితాలో తిరిగి చేర్చిందని చెప్పారు. అలాగే, జాబితాలో పేర్లు లేని వారు ట్రైబ్యునల్ ఎదుట హాజరవ్వాలని సూచించారు. నాదియా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు. అలాగే, చొరబాట్లపై కేంద్ర వైఖరిని మమతా ప్రశ్నించారు. దేశ సరిహద్దులను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మమత స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం, తమ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సహా హక్కులను కాపాడుకునేందుకు బంగాల్ పౌరులంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు బంగాల్ ప్రజల గౌరవాన్ని, గుర్తింపును కాపాడే పోరాటమని అభివర్ణించారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం బంగాల్? ఓటర్ల జాబితా నుంచి దాదాపు 91 లక్షల మంది ఓటర్లను తొలగించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించి తుది జాబితా ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే, ఈ విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారని మమతా ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన డేటా ప్రకారం, గత ఏడాది అక్టోబర్ చివరి నాటికి గుర్తించిన 7.66 కోట్ల మంది ఓటర్ల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుంటే, ప్రస్తుతానికి రాష్ట్రంలో జరిగిన మొత్తం తొలగింపుల శాతం 11.85 శాతానికి పైగా ఉన్నాయి. అలాగే, ఎస్?ఐఆర్? ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన మొత్తం తొలగింపుల సంఖ్య 90.83 లక్షలకు పైగా ఉంది. పరిశీలనలో ఉన్న 60.06 లక్షల మంది ఓటర్లలో దాదాపు 27.16 లక్షల మందిని జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ గణాంకాలు వెల్లడించాయి.

మరోవైపు, ముస్లిం జనాభా అధికంగా ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలో అత్యధిక తొలగింపులు నమోదైనట్లు గణాంకాలు తెలిపాయి. ఈ జిల్లాలో న్యాయపరమైన పరిశీలనలో ఉన్న 11.01 లక్షల పేర్లలో 4.55 లక్షలకు పైగా పేర్లను జాబితా నుంచి తొలగించారు. దీనితో ఆ జిల్లాలో పరిశీలనలో ఉన్న ఓటర్ల తొలగింపు శాతం సుమారు 41.33 శాతానికి చేరింది. అలాగే, బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్న ఉత్తర 24 పరగణాల జిల్లాలో కూడా గణనీయమైన తొలగింపులు నమోదయ్యాయి. ఇక్కడ పరిశీలనలో ఉన్న 5.91 లక్షల మంది ఓటర్లలో 3.25 లక్షలకు పైగా ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు కాదని తేలింది. అలాగే మాల్దా జిల్లాలో న్యాయపరమైన సమీక్షలో ఉన్న 8.28 లక్షల మంది ఓటర్లలో 2.39 లక్షలకు పైగా ఓటర్లను జాబితా నుండి తొలగించారు. అలాగే, న్యాయపరమైన పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం దక్షిణ 24 పరగణాల జిల్లాలో తొలగింపుల సంఖ్య దాదాపు 2.23 లక్షలు, తూర్పు బర్ధమాన్ జిల్లాలో 2.09 లక్షలు, నాదియా జిల్లాలో 2.98 లక్షలుగా నమోదైనట్లు ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చెందిన భవానిపుర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉన్న కోల్‌కతా సౌత్‌లో 28,000 మందికి పైగా ఓటర్లను తొలగించారు. కోల్‌కతా నార్త్‌లో పరిశీలనలో ఉన్న సుమారు 39,000 మంది ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు కాదని తేలింది. కాగా, బంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశలో ఏప్రిల్ 23న 152 స్థానాలకు, మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న రెండో దశలో పోలింగ్ జరగనుంది.

## మతవిశ్వాసం న్యాయ సమీక్షకు అతీతం

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10–50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్రం సమర్థించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసానికి సంబంధించినదని పేర్కొంది. ఈ ఆంక్షలు మత స్వయం ప్రతిపత్తి పరిధిలోకి వస్తాయని, న్యాయ సమీక్ష పరిధికి అతీతమైనవని స్పష్టం చేసింది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళ ప్రవేశంపై కేంద్రం వైఖరిని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియజేశారు. "మనం అన్ని మత విశ్వాసాలను గౌరవించాలి. ప్రతీ విషయం గౌరవానికి లేదా శారీరక స్వేచ్ఛకు సంబంధించినది కాదు. నేను ఒక గురుద్వారాకు వెళ్లినప్పుడు నా తలపై ఒక వస్త్రాన్ని కట్టుకుంటాను. అప్పుడు నేను నా గౌరవం, హక్కులు, ఇష్టాలకు భంగం కలిగిందని అనలేను" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి తుషార్ మెహతా వెల్లడించారు. "నరబలి ఒక మతపరమైన ఆచారమని ఎవరైనా వాదించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద కోర్టును ఆశ్రయిస్తే అది మతపరమైన సంప్రదాయమా లేదా ఆవశ్యకమైన ఆచారామా అని కోర్టు పరిశీలించాల్సిన అవసరం లేదు. ప్రజా భద్రత, నైతికతను నేరుగా ఉల్లంఘిస్తుందనే కారణంతో ఆ పిటిషన్‌ను నేరుగా తిరస్కరించవచ్చు. రాజ్యాంగం మత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. ఎందుకంటే మతాల్లో మెజారిటీ ప్రజల అభిరుచికి సంబంధించిన లౌకిక ప్రమాణాలను సంతృప్తిపరచని నమ్మకాలు, ఆచారాలు, ఆరాధనా రూపాలు ఉండొచ్చు. రాజ్యాంగంలో రాజ్యాంగ నైతికత గురించి కచ్చితంగా నిర్వచించలేదు. మతపరమైన విషయాలు, పవిత్ర గ్రంథాలు, శాస్త్రాలు, గ్రంథాలు మొదలైన వాటిపై న్యాయస్థానానికి పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. ప్రతి మతానికి దాని విభిన్న విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగానికి వారి సొంత విశ్వాసంపై నమ్మకం ఉంది" అని తుషార్ మెహతా స్పష్టం చేశారు. అన్ని వయసుల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతిస్తూ 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని తుషార్ మెహతా కోరారు. గుడిలోకి మహిళల ప్రవేశంపై నిషేధం అంటరానితనానికి సమానమని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను ఉల్లంఘిస్తుందని అప్పట్లో సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించిందని, ఈ విషయంపై తనకు చాలా అభ్యంతరాలు ఉన్నాయన్నారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆంక్షలు కేవలం వయసు ఆధారంగా మాత్రమే ఉన్నాయని వెల్లడించారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని పూర్తిగా బహిష్కరించలేదని చెప్పారు. మహిళా దేవతలకు నమస్కరించే ఏకైక సంస్కృతి మనదేనని అన్నారు.

## రేవంత్ రెడ్డిపై కేరళ సీఎం ఘాటు విమర్శలు

ఎప్పుడూ హుందాగా వ్యవహరించే కేరళ సీఎం విజయన్, తాజాగా తెలంగాణ సీఎం రేవంత్‌పై ఘాటుగా స్పందించారు. ఒకరకంగా చెప్పాలంటే రేవంత్ రెడ్డిని కించపరిచేలా ఉండే మలయాళ పదాలను ఉపయోగించడం కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఇటీవలే రేవంత్ చేసిన కామెంట్స్ తనను వ్యక్తిగతంగా, రాజకీయంగా కించపరిచేలా ఉన్నాయని భావించిన విజయన్ ఈ మేరకు తీవ్రస్థాయిలో స్పందించినట్లు తెలుస్తోంది. మంగళవారం రోజు కేరళలోని కన్నూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ సమావేశంలో విజయన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి తప్పుపట్టారు. మలయాళం భాషలోని పరుష పదజాలంతో సీఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి లాంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రేవంత్ ప్రసంగాల్లో ఇంతటి దారుణమైన భాషను ఉపయోగించొచ్చా అంటూ విజయన్ ఫైర్ అయ్యారు. సీఎం స్థాయి పదవికి తగిన ప్రమాణాలను రేవంత్ పాటిస్తున్నారా లేదా అని ఆయన ప్రశ్నించారు. కేరళ ఎన్నికల చివరి దశ ప్రచార కార్యక్రమాల హడావిడి కారణంగా రేవంత్ వ్యాఖ్యలపై స్పందించేందుకు తనకు సరిపడా సమయం లేదన్నారు. రేవంత్ రెడ్డి చేసిన అన్ని వ్యాఖ్యలపై త్వరలోనే సరైన సమయంలో స్పందిస్తానని విజయన్ వెల్లడించారు. ఒక ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన కనీస మర్యాదను ఇచ్చారా లేదా అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలని రేవంత్‌కు ఆయన సూచించారు. 'దశ మోనే రేవంత' అనేది మలయాళం భాషలో వ్యంగ్య విమర్శలకు ప్రయోగించే పదం. ఇటీవలే 'నీ పో మోనే విజయ' (నీ పని అయిపోయింది. ఇక వెళ్లు విజయన్) అని సీఎం రేవంత్ విమర్శించారు. దీనికి ఇప్పుడు విజయన్ పరుష పదజాలంతో కౌంటర్ ఇచ్చారు. కేరళ ప్రజలంతా మళ్లీ సీపీఎం సారథ్యంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని సీఎం విజయన్ అన్నారు. 2021 ఎన్నికల నాటి కంటే ఎక్కువ అసెంబ్లీ సీట్లతో ఈసారి అధికారంలోకి వస్తామని విశ్వాసం వెలిబుచ్చారు. అన్నిచోట్లా కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమికి ప్రజా తిరస్కరణే ఎదురవుతోందని ఆయన పేర్కొన్నారు.

# చర్చకు సిద్ధం



-మొదటిపేజీ తరువాయి
విజయన్ సహా ఎల్‌డీఎఫ్ నేతలకు స్పష్టం చేశారు. ఎన్నికలు కేరళం, తెలంగాణ మధ్య కాదన్న రేవంత్ యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య జరుగుతున్నాయని తెలిపారు. పినరయి విజయన్ పని అయిపోయిందన్న రేవంత్‌రెడ్డి, మూడింట రెండొంతుల మెజార్టీతో యూడీఎఫ్ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల తనపై పినరయి చేసిన విమర్శలను రేవంత్‌రెడ్డి తోసిపుచ్చారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఎలా మార్చారో కేరళంలో విజయన్‌ను కూడా అలా మారుస్తారని రేవంత్ రెడ్డి అన్నారు. విజయన్‌గాడ్ ఫాదర్ మోదీ ఢిల్లీలో ఉన్నారన్నారు. ఆయనే విజయన్‌ను కేసుల నుంచి రక్షిస్తున్నారని రేవంత్ వివరించారు. మోదీ, విజయన్ మధ్య ఒప్పందం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కేరళంలో సక్సెస్ స్టోరీ విజయన్ పాలనలో వచ్చింది కాదని ఉమెన్‌చాందీ, కరుణాకరన్ కేరళం అభివృద్ధి కోసం బాటలు వేశారన్నారు. పినరయి విజయన్‌కు కాలం అయిపోందని అన్నారు. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చున్నారు. ఈ విషయంలో తాను విజయన్‌కు సవాల్ విసురుతున్నానన్నారు. పినరయి విజయన్ కేరళం ప్రజలను మోసం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇందుకు సంబంధించి తాను చాలా ఆధారాలు ఇచ్చానన్నారు. వారు తెలంగాణపై(పినరయి విజయన్) తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. దీనిపై పినరయి విజయన్‌తో చర్చకు తాను సిద్ధమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయనకు ఆదర్శవంతమైన నేతలు మోదీ, అమిత్‌షానా లేక జ్యోతిబసు, సోమనాథ్ చటర్జీనా అని ప్రశ్నించారు. విజయన్ ప్రధాని మోదీ సూచనలు తీసుకుంటున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక మోదీ దిల్లీ నుంచి పాలిస్తే మరో మోదీ తిరువనంతపురం నుంచి పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేరళంలో విజయన్? మోదీలా పాలిస్తున్నారన్నారు. ఓట్ల కోసం మోదీలానే విజయన్? తన పేరుతో ప్రచారం చేస్తున్నారన్నారు.

“కేరళంలో పోటీ తెలంగాణ, కేరళం మధ్య కాదు. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ మధ్య జరుగుతోంది. నేను అడిగిన ప్రశ్నలకు ఆయన? (పినరయి విజయన్) సమాధానం చెప్పాలి. ఆయన 120 నెలల పాటు కేరళంను పాలించారు. ఆయన తన పాలనపై కేరళం ప్రజలకు సమాధానం చెప్పాలి. నేను వాస్తవాలను ప్రజల ముందు ఉంచాను. ఆ సమాచారంపై ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అందుకే వాస్తవాలతో కూడిన లేఖ కూడా రాశాను. వాటిపై ఆయనతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాను. పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ 2023-24 ముందు వరకూ తెలంగాణలో అధికారంలో ఉండేవారు. అప్పుడు తెలంగాణ పరిస్థితిని విజయన్ ప్రస్తావించారు.నేను అప్పుడు అధికారంలో లేను. ఆ పాలనను చూసే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఇంటికి పంపారు. ఇప్పుడు పినరయి విజయన్ వంతు వచ్చింది”-రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

**సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై స్పందించిన కేరళ ముఖ్యమంత్రి :**
తనతో చర్చకు రావాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం సీఎం పినరయి విజయన్ స్పందించారు. రేవంత్‌రెడ్డితో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని వివరించారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణ రాష్ట్రంలో పార్టీలు ఉన్నాయని, రేవంత్ ప్రభుత్వ పనితీరుపై తెలంగాణ ప్రజలే తీర్పు ఇవ్వాలని విజయన్ తెలిపారు. కేరళంలో ఎన్నికల ప్రచార సభలో అభివృద్ధిపై తనతో చర్చకు రావాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే.

# తెలంగాణ మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారింది

-మొదటిపేజీ తరువాయి
అవకాశం ఏర్పడిందన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకమని తెలిపారు. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణతో కలిసి డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టల్లోని పామునూరు పోలీస్ ఔట్ పోస్ట్‌కు భూమిపూజ చేశారు. ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ-ఛత్తీస్?గఢ్ సరిహద్దుల్లో రోడ్లు వేసి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి**
కర్రెగుట్టలు ప్రాంత అభివృద్ధికి అటంకంగా ఉన్న సమస్య చాలా వరకు తీరిపోయిందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి దూరమైన ప్రాంతాలను మిగతా ప్రపంచంతో అనుసంధానం చేయాలని, అలా చేస్తేనే ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకుంటాయని కేంద్ర, రాష్ట్రాలు భావించాయని తెలిపారు. ఏ ప్రాంతం అయిన బాగుండాలంటే మౌలిక వసతులు, భద్రత బాగుండాలన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టల్లో అభివృద్ధికి దూరమైందని, ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలతో అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్ముందు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ నక్సల్స్? విముక్త ప్రాంతంగా మారిందని వివరించారు. పామునూరు గ్రామస్థులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, సోలార్ లాంతర్లను డీజీపీ పంపిణీ చేశారు. అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్లు వేస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి మంచి అవకాశం ఉందన్నారు.
“మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉండటం వల్ల కర్రెగుట్టలు చాలా కాలం పాటు అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. కనీస సౌకర్యాలైన రోడ్లు, వీధిలైట్లు లాంటివి లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. నక్సల్స్? దాదాపు అంతరించడంతో అభివృద్ధి దిశగా పడుతున్నాయి. బాహ్యప్రపంచంతో అనుసంధానం ఏర్పరిచేందుకు రోడ్లు ఉపయోగపడతాయి. అందులో భాగంగానే ఇక్కడ రోడ్లు వేయడం జరిగింది. ఇప్పటి వరకు 13 కి.మీ రోడ్ల నిర్మాణం పూర్తయింది



**రోడ్డు భద్రతే అన్నింటికన్నా ముఖ్యం**
అజాగ్రత్తతో వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని సురక్షిత డ్రైవింగ్? అన్ని విధాల మేలని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలంలో రోడ్డు భద్రతపై అరైవ్ అలైవ్? కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. హెల్మెట్? లేకుండా, సెల్?ఫోన్? మాట్లాడుతూ వాహనం నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఆయన తెలిపారు.
అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్డు వేయిస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఇక్కడ ఎకోటూరిజం అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు. గతంలో తాడ్వాయి దాటి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయలేకపోయామన్నారు. ఇప్పుడు అడవుల్లోనూ ఎకో టూరిజం సాధ్యమవుతోందన్నారు. ములుగు జిల్లాలో ఏజెన్సీలోని వాటర్?ఫాల్స్?ను అభివృద్ధి చేస్తామన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి

**నల్గొండ :** ల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఎగబడుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత నిధులతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన ఈ పాఠశాలలో స్మార్ట్ క్లాసులు, ఏఐ బోధన, డిజిటల్ ల్యాబ్స్ వంటి అత్యాధునిక వసతులు ఉండటంతో ప్రైవేట్ స్కూళ్లను వదిలి ఇక్కడ చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సీట్లు పరిమితంగా ఉండటంతో అడ్మిషన్ల కోసం భారీగా రద్దీ నెలకొంది. ఉదయం నుంచే స్కూల్ గేటు ముందు క్యూలైన్లలో వేచి ఉంటున్నారు.గవర్నమెంట్ స్కూల్స్ అంటే శిథిలావస్థలో ఉన్న భవనాలు, అరకొర వసతులు అనే ముద్ర ఇప్పటికీ ఉంది. ప్రస్తుత కాలంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చదివించేందుకు ఇష్టపడటం లేదు. అప్పు చేసైనా సరే.. ప్రైవేటు స్కూళ్లకు పంపించాలనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉంటున్నారు. కానీ నల్గొండలోని ఓ గవర్నమెంట్ స్కూల్ మాత్రం అందుకు భిన్నం. బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేరెంట్స్ అభిప్రాయాన్ని పూర్తిగా చెరిపివేసింది. ఈ స్కూల్‌లో అడ్మిషన్ కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఒక సీటు సంపాదించడం కోసం తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం చూస్తుంటే కార్పొరేట్ స్కూళ్లు కూడా దిగదుడుపే అనిపిస్తోంది. ఇవాళ తెల్లవారుజాము నుంచే స్కూల్ గేటు ముందు తల్లిదండ్రులు, విద్యార్థులు భారీ క్యూ లైన్లలో వేచి చూడటం ఇక్కడి విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది.రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడి జ్ఞాపకార్థం ఈ పాఠశాలను సొంత నిధులతో అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు. కేవలం భవన నిర్మాణమే కాకుండా, విద్యాబోధనలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇక్కడ విద్యార్థులకు స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన, అత్యాధునిక డిజిటల్ ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుల అనుభవజ్ఞులైన బోధనతో పాటు, అధునాతన సాంకేతికత తోడవడంతో విద్యార్థుల భవిష్యత్తుకు ఇక్కడ బలమైన పునాది పడుతోందని తల్లిదండ్రులు భావిస్తున్నారు.చదువుతో పాటు విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం విశాలమైన క్రీడా మైదానాన్ని కూడా ఏర్పాటు చేశారు. అలాగే, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. నల్గొండ జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం ప్రభుత్వ పాఠశాల కాదని.... కార్పొరేట్ స్థాయికి దీటైన ఒక విశ్వవిద్యాలయంలా ఉందని క్యూలో నిలబడిన ఒక తండ్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.సీట్లు పరిమితంగా ఉండటం, డిమాండ్ విపరీతంగా పెరగడంతో పాఠశాల యాజమాన్యానికి అడ్మిషన్ల నిర్వహణ పెద్ద సవాలుగా మారింది. మంత్రి విజన్, అధికారుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కృషి వెరసి ఈ పాఠశాల నేడు ఒక కార్పొరేట్ స్కూల్‌గా నిలిచింది. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచడమే కాకుండా.. విద్యా విప్లవానికి నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాక్షిగా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను తలుచుకుంటే భయపడే రోజులు పోయి.. గర్వంగా చేర్పించే రోజులు వచ్చాయని అంటున్నారు.




## విస్తరణ పక్కా

-మొదటిపేజీ తరువాయి
అధిష్టానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు ప్రస్తుతం కేరళ సహా ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ కీలక సమయంలో కేబినెట్ విస్తరణ చేపడితే పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తి ఎన్నికల వ్యూహాలపై ప్రభావం పడుతుందని హైకమాండ్ భావిస్తోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాతే తెలంగాణలో పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని ముఖ్యమంత్రి స్వయంగా స్పష్టం చేయడంతో ఆశావహులు తమ ప్రయత్నాలను తాత్కాలికంగా నెమ్మదించారు.ఈసారి విస్తరణ కేవలం ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీకే పరిమితం కాకుండా ఒక భారీ ప్రక్షాళన దిశగా సాగనుంది. మంత్రుల గత ఏడాది కాలం పనితీరుపై ముఖ్యమంత్రి ఇప్పటికే ఒక ప్రోగ్రెస్ రిపోర్ట్ సిద్ధం చేసినట్లు సమాచారం. శాఖల వారీగా సాధించిన పురోగతి, ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, మంత్రులపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు లేదా ముగ్గురు పాత వారిని తప్పించే అవకాశం ఉంది. పనితీరు సరిగ్గా లేని వారి స్థానంలో కొత్త రక్తానికి అవకాశం ఇచ్చి పాలనలో వేగం పెంచాలని రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు.సామాజిక సమీకరణాల పరంగా ఈ విడత విస్తరణలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటివరకు మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం లేని బీసీ సామాజిక వర్గానికి అలాగే లంబాడా వర్గానికి కచ్చితంగా చోటు కల్పించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచేలా ముఖ్యమంత్రి తన బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు. మైనారిటీ కోటాలో మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పేరు పరిశీలనలో ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కుతుందా లేదా కీలక నామినేటెడ్ పదవితో సరిపెడతారా అనేది ఐదు రాష్ట్రాల ఫలితాల అనంతరం తేలనుంది.విస్తరణ వార్తలతో ఆశావహ ఎమ్మెల్యేల్లో టెన్షన్ పెరిగింది. సీనియర్ నేతలు రాజగోపాల్ రెడ్డి, శ్రీధర్ బాబు వంటి వారు తమ ప్రాధాన్యతలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుండగా మరికొందరు కొత్తగా చోటు దక్కించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో పైరవీలు ముమ్మరం చేశారు. తమ పదవులు ఊడుతాయన్న భయంతో కొందరు మంత్రులు అధిష్టానం పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇదే సమయంలో కీలక నామినేటెడ్ పదవుల భర్తీ కూడా ఉండటంతో పార్టీలో పదవుల వేట తీవ్రతరమైంది.తెలంగాణ కేబినెట్ మార్పులు జాతీయ రాజకీయాల ఫలితాలతో ముడిపడి ఉన్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించే సీట్ల ఆధారంగా అధిష్టానం ముఖ్యమంత్రికి ఇచ్చే స్వేచ్ఛ ఆధారపడి ఉంటుంది. మే నెలలో ఫలితాలు వచ్చిన వెంటనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే పాలనలో తనదైన ముద్ర వేసేలా సమర్థులైన వారితో కూడిన సరికొత్త రేవంత్ మార్క్ కేబినెట్ మే నెలలో రూపుదిద్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## ‘రేవంత్.. మళ్లీ గెలవడం కాదు.. సింగిల్ డిజిటే మీకు’

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందంటూ సీఎం రేవంత్ చేసే వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు హరీష్‌రావు. కాంగ్రెస్ మళ్లీ గెలవడం కాదు.. సింగిల్ డిజిట్‌కే పరిమితం అంటూ ఎద్దేవా చేశారు. ఈరోజు(మంగళవారం, ఏప్రిల్ 7వ తేదీ) పరిగి పర్యటనకు వెళ్తున్న హరీష్‌రావును పోలీసులు అరెస్ట్ చేసి శంషాబాద్ పీఎస్‌కు తరలించారు. దీనిలో భాగంగా ఆయన్ను విడుదల చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు హరీష్. ‘మీరు మళ్లీ గెలవడం కాదు కదా.. ఈసారి సింగిల్ డిజిటే మీకు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవ్వడం ఖాయం. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?, పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే మమ్మల్ని అరెస్టు చేశారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన... బేడీల పాలన గుడ్డి పాలన. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండి. ఎస్సీ ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారు. మీ పాలన అంతా బోగస్ మాటలు బోగస్ పాలన. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా?, పరిగిలో భూముల లాక్కొని తన అన్య కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదు?, వచ్చే ఎన్నికల్లో రాబోయే కేసీఆర్ రాజ్యమే’ అని హరీష్ స్పష్టం చేశారు.

## పాత పేరు.. కొత్త అజెండా



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక మలుపునకు రంగం సిద్ధమవుతోంది. భారత రాష్ట్ర సమితి అగ్రనాయకత్వానికి ఊహించని షాక్ ఇస్తూ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అజెండాను సిద్ధం చేసుకుంటున్నారు. తాజాగా ఆమె మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్‌కు మారుపేరైన ‘టీఆర్ఎస్’ పేరును ఆమె ప్రస్తావించడం, బీఆర్ఎస్ ఉనికికే సవాలుగా మారేలా కనిపిస్తోంది. పరోక్షంగా తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై చర్చించేందుకు పిలిచిన ఈ సమావేశంలో రాజకీయ ప్రశ్నలు ఎదురైనప్పుడు ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “ప్రస్తుతం టీఆర్ఎస్ పేరు ఫ్రీగా ఉంది.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చు” అని ఆమె అనడం వెనుక లోతైన వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తన పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల మేరకే నడుస్తుందని, తమకు ఇతర రాష్ట్రాల సిద్ధాంతకర్తలు అవసరం లేదని స్పష్టం చేయడం ద్వారా ఆమె నేరుగా బీఆర్ఎస్ ప్రస్తుత పోకడలపై విమర్శలు గుప్పించారు.2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి , రెండు దశాబ్దాల పోరాటం తర్వాత రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. అయితే, 2022 అక్టోబర్ 5న జాతీయ రాజకీయాల కాంక్షతో కేసీఆర్ ఈ పేరును భారత రాష్ట్ర సమితి మార్చారు. ఈ నిర్ణయం చారిత్రక తప్పిదమని, దీనివల్ల తెలంగాణ అస్తిత్వంతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని ఇప్పుడు పార్టీ శ్రేణులే భావిస్తున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లకే పరిమితం కావడం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో బీఆర్ఎస్ తీవ్ర నైరాశ్యంలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో కవిత మళ్లీ పాత పేరును తలకెత్తుకోవడం ద్వారా తెలంగాణ వాదులను, అసంతృప్త నేతలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.కవిత తన మాటల్లో మరో కీలక అంశాన్ని ప్రస్తావించారు. తమ పార్టీలో బిహార్ సిద్ధాంతకర్తలు ఉండరని చెప్పడం ద్వారా బీఆర్ఎస్ నియమించుకున్న పొలిటికల్ స్ట్రాటజిస్టుల పెత్తనాన్ని ఆమె ఎండగట్టారు. ఇది నేరుగా కేటీఆర్ అనుసరిస్తున్న కార్పొరేట్ తరహా రాజకీయాలపై ఆమె చేసిన దాడిగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే శక్తి దానికి లేదని ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత పోరును బహిర్గతం చేస్తున్నాయి.కవిత తన కొత్త పార్టీ పేరును, అజెండాను ఈ నెలాఖరున ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె నిజంగానే టీఆర్ఎస్ పేరుతో ముందుకు వస్తే బీఆర్ఎస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరం. తెలంగాణ ప్రజల గుండెల్లో టీఆర్ఎస్ అనే పేరుకు ఉన్న క్రేజ్ కవితకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. పాత ఉద్యమకారులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు కవిత వైపు మొగ్గు చూపితే బీఆర్ఎస్ కు ఇబ్బందులు తలెత్తవచ్చు. కవితను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ చట్టపరమైన లేదా రాజకీయపరమైన ప్రయత్నాలు చేస్తే, అది ఆమెకు మరింత పబ్లిసిటీని తెచ్చిపెడుతుంది.తండ్రి వదులుకున్న అస్త్రమే ఇప్పుడు తనయకు ఆయుధంగా మారింది. పాత పేరు ? కొత్త అజెండాతో కవిత చేస్తున్న ఈ ప్రయోగం తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని ఏ విధంగా మారుస్తుందో చూడాలి. ఒకవేళ కవిత టీఆర్ఎస్ ను మళ్లీ బతికించగలిగితే, కేసీఆర్ వారసత్వాన్ని తానే కొనసాగిస్తున్నానని ఆమె క్లెయిమ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.

## సంపాదకీయం

# కలవరం గురిచేస్తోన్న ఆకునూరి నివేదిక

ప్రతి ఊరికి ఒక గుడి ఉంటుందో లేదో కానీ బడి మాత్రం ఉంటుంది. బడి ప్రాధాన్యత అలాంటిది. ఒకవేళ ప్రభుత్వ పాఠశాల కానీ ప్రైవేటు పాఠశాల కానీ లేకపోయినా కనీసం ఆ ఊర్లో ఎవరో చదువుకున్న వ్యక్తి అయినా నలుగురిని కూర్చోబెట్టుకుని ఏదో నేర్పుతుంటాడు. చదువుకు అనాది నుండి అదే ప్రాముఖ్యత. ఎవరైనా తాము చదివిన బడిని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను అంత తొందరగా మరువలేరు. బడి పట్ల అభిమానం, గురువుల పట్ల గౌరవం ఏనాడు తరగవు. బడితో ఉండే అనుబంధం చిరకాలం నిలుస్తుంది. చిన్ననాటి బడి గురువులు కనపడగానే సహజంగానే మనసు గతం లోతుల్లోకి వెళ్లిపోతుంది. మన తెలంగాణ విద్యా కమిషన్ ఊళ్ళలోని పాఠశాలలను విలీనం చేసి ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి మూడు లేదా నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయమని సిఫార్సు చేయగా రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించి నిధులు కేటాయించి రంగంలోనికి దిగుతున్నది. మనం చిన్నతనంలో చదువుకున్న ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, సెకండరీ పాఠశాలలన్నీ కలిసిపోయి ఒకే పాఠశాలగా ఇంటర్మీడియట్‌వరకు నడుస్తాయట. వివిధ యాజమాన్యాలతో నేడు నడుస్తున్న 28 రకాల పాఠశాలలన్నీ మాయమై మూడు లేదా నాలుగు రకాలు మాత్రమే మనకు కనబడతాయి. అంతేకాదు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా క్రమంగా తగ్గిపోయి కాలక్రమంలో కాంట్రాక్టు టీచర్లే ఈ పబ్లిక్ స్కూల్స్‌లో పాఠాలు చెప్తారు. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ బోర్డు కూడా రద్దు కాబోతున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి వార్షిక పరీక్షలు కూడా ఉండవు. ఈ పెను మార్పులన్నీ విద్యా విధానాన్ని ఏం చేస్తాయో కానీ మొత్తం మీద ఒక గందరగోళ పరిస్థితి మాత్రం ప్రస్తుతం నెలకొని ఉంది. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బిఎస్‌సి, ఫార్మసీ లాంటి కోర్సులు చదవడానికి కూడా ప్రవేశ పరీక్షలు ఉండవు. కేవలం ఇంటర్‌లో మార్కుల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇక భవిష్యత్తులో గురుకులాల సంఖ్య పెరగబోదు. అవి అలాగే కొనసాగితే సంతోషించాల్సిన పరిస్థితి. తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి అనే ఒక ఐఏఎస్ అధికారి నేతృత్వంలోని టీం రాష్ట్రంలోని 35 పాఠశాలలు తిరిగి తల్లిదండ్రులతో, విద్యార్థులతో సమావేశాలు జరిపి 54 సెమినార్లు నిర్వహించి ఐదు రాష్ట్రాలు, మూడు విదేశాలు పర్యటించి దాదాపు 18 నెలల కాలంలో ఇచ్చిన నివేదికలో 434 సిఫార్సులు చేసి విద్యావేత్తలను, ఉపాధ్యాయ సంఘాలను, ముఖ్యంగా విద్యాభిమానులను ఆశ్చర్యములో నేకాక ఆగ్రహానికి గురిచేసింది. ప్రభుత్వ విద్యను, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు మంగళం పాడుతామని ప్రభుత్వం పదేపదే చెప్పడమే కానీ గత రెండున్నర ఏళ్లలో అందుకు చేసిందేమీ లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు లక్షల్లో తగ్గుతుండగా, ప్రైవేటు రంగంలోని బడులలో అవి అదే సంఖ్యలో పెరగడం గమనార్హం. గత పదిహేళ్లుగా ఎన్నో విజయాలు సాధించి ఉచిత, నాణ్యమైన విద్యను అందిస్తూ పివి నరసింహారావు ఆలోచనలకు, ఎన్‌టి రామారావు ఆశయాలకు అనుగుణంగా నడిచి ఐఐటి, మెడిసిన్ సీట్లు గణనీయంగా సాధిస్తూ ఇటు క్రీడారంగంలో కూడా దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టిన గురుకులాలకు నేడు ఆదరణ కరువై కునారిల్లుతున్నాయి. ఆకునూరి కమిటీ నివేదిక విద్యారంగంలో కలకలాన్ని సృష్టించింది. ప్రభుత్వ రంగంలో నేటి వరకు పూర్వ ప్రాథమిక పాఠశాలలు లేవు. పల్లెల్లో అంగన్వాడీలు ఉన్నాయి. అన్ని పాఠశాలలనూ విలీనం చేస్తే పూర్వ ప్రాథమిక నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నిర్వహించడం అనేక వయసుల వారు అంటే మూడేళ్ల నుండి 17 ఏళ్ల వరకు విద్యార్థులు ఒకే చోట విద్యాభ్యాసం చేయడం సబబేనా? ఆరోగ్యకర వాతావరణం సాధ్యమేనా? కేవలం భవనాలతో రంగులతో, హంగులతో నాణ్యమైన విద్య ఇవ్వగలరా? కార్పొరేట్ వ్యవస్థలో ఇరుకు గదులలో గాలి వెలుతురు లేకుండా క్రీడా మైదానం ఇతర కృత్యాలు లేకుండా ఫలితాలు రావడం లేదా? వాటిని మనం సమర్థించడం లేదు. కానీ నాణ్యత కోసం వేల కోట్ల రూపాయల ఖర్చు కంటే ఒక 1000 కోట్లు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ బాగు చేయవచ్చు. బలోపేతం చేయడం అంటే విలీనం చేసి ఒకేచోట విద్యాభ్యాసం ఏర్పాటు చేయడమేనా? గురువులకు జీతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని, వారికి పదోన్నతులు వద్దని చెప్పడం ఒకరకంగా గురువులకు పంగనామాలు పెట్టడమే. సమాజానికి మార్గదర్శి అయిన గురువు ప్రాధాన్యతను తగ్గించి అవమానించడమే. కాంట్రాక్టు టీచర్లు ఎంత సామర్థ్యం కలిగి ఉన్నా తక్కువ జీతానికి అభద్రతాభావంతో వారు పనిచేయడం కూడా అనుమానాస్పదమే. జాతీయస్థాయిలో అద్భుతాలు సృష్టిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డును రద్దుచేసి పాఠశాల విద్యలో విలీనం చేయవలసిన అవసరం లేదు కదా! అంటే నూతన విద్యా విధానాన్ని మన ప్రభుత్వం అనుసరించబోతున్నదా? చిన్ననాటి నుండి ఆంగ్ల మాధ్యమం కూడా అర్థంలేని సిఫారసు. భావ నిర్మాణం మాతృభాషలోనే సాధ్యమని అనేక కమిటీలు విధానాలు ఘోషిస్తున్నాయి. పాఠశాలలో తప్ప మిగిలిన జీవితంలో మనం మాట్లాడేది మాతృభాష మాత్రమే. అంతేకాదు గిరిజన భాషలకు కూడా ముప్పు ఏర్పడవచ్చు. ఆంగ్ల మాధ్యమాన్ని 5 నుండి లేదా 8వ తరగతి నుండి ఐచ్ఛికం చేయవచ్చు. అసలు ఆంగ్ల మాధ్యమంలో బోధించే నైపుణ్యం గల ఉపాధ్యాయులు చాలినంత మంది ఉన్నారా? శిక్షణ ఇచ్చినంత మాత్రాన రోజుల్లోనే నైపుణ్యం వస్తుందా? ప్రతిరోజు విద్యార్థులు ప్రయాణం చేయడం రిస్క్‌తో కూడిన పని. 24 గంటలు క్యాంపస్‌లో ఉంటేనే ఊహించని ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వేల పాఠశాలల నిర్మాణం ఎన్ని సంవత్సరాలకు జరిగేను? ఒకవేళ ప్రభుత్వాలు మారితే ఈ విధానం ఈ బడులు నిలిచేనా? రూ. 20 వేల కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఎవరికోసం? ఈ విలీనం విద్యా వికాసానికా లేక విధ్వంసానికా అనేది విద్యావేత్తలు ముఖ్యంగా ఉపాధ్యాయుల సందేహం. గిరిజన బిడ్డల భవితవ్యం ఏమిటి? ఏం కాబోతున్నది? గ్రామీణ నిరుపేదలు చదువుకు మరింత దూరం అవుతారా అనే ఆందోళన ప్రజల్లో ఉంది. విద్యకు 18 శాతం బడ్జెట్ కేటాయింపు చేయాలన్న సిఫార్సు అందరికీ ఆమోదయోగ్యమే కానీ ప్రభుత్వానికి అది ఆచరణ సాధ్యం కాదు. అందుకే 2026- 27 బడ్జెట్లో 8.2% కేటాయించి తన ఉద్దేశాన్ని చాటిచెప్పింది.కమిషన్ ఆలోచనలు ఆకాశంలో ఉండగా ప్రభుత్వ చేతలు పాతాళంలో ఉన్నాయి. విద్యార్థుల ఆశలు, తల్లిదండ్రుల ఆకాంక్షలు ఉపాధ్యాయుల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల కంటే బోధనేతర సిబ్బందికే ఎక్కువ జీతాలు సిఫార్సు చేయడం ద్వారా ఈ కమిషన్ ఉపాధ్యాయుల శ్రమ దోపిడీకి ఎర్రతివాచీ పరిచినట్లుగానే భావించాలి. మానవ వనరుల అభివృద్ధి జరగాలంటే ఉపాధ్యాయులకు సంతృప్తికరమైన వేతనాలు ఉండాలి. అనేక దేశాల్లో ఉపాధ్యాయుల వేతనాలు అత్యధికంగా ఉన్నాయి. కానీ కమిషన్ వాటిని పరిశీలనలోనికి తీసుకోలేదు. తన పరిధి దాటి కమిషన్ వేతనాల గురించి వ్యాఖ్యానించడం అభ్యంతరకరం. ఉపాధ్యాయ శిక్షణలను మరింత పక్కాగా నడిపించాలి అనేది ఒప్పుకోదగిన అంశం. ఇంటర్ తర్వాత వృత్తి విద్యా కోర్సులకు ప్రవేశ పరీక్ష వద్దు అని చెప్పడం ప్రైవేటు రంగానికి మార్గం మరింత సుగమం చేస్తున్నది. ఇంతకాలంగా వృత్తి విద్యా కోర్సులు చదవడానికి పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు ఆ పథకాన్ని తీసివేయాలని చెప్పడం పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు దూరం చేయడమే. డిగ్రీ గురుకులాలను రద్దు చేయాలనడం సంక్షేమ విద్యార్థుల ఉన్నత విద్య ఆశయాలకు అడ్డుకట్ట వేయడమే. ప్రజలకు, వారి నివాసాలకు విద్యాలయాలు అందుబాటులో ఉండాలనే ప్రాథమిక సూత్రాన్ని కమిషన్ ఉల్లంఘించినట్లు స్పష్టం అవుతున్నది. అంటే కమిషన్ సభ్యులు యుజిసి నిబంధనలు అధిగమించి ప్రామాణికంగా ఉన్న కొఠారి కమిషన్ సూత్రాలను పక్కనపెట్టి విద్యా హక్కు చట్టాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా నివేదిక తయారు చేశారా అనే ప్రశ్న ఉదయిస్తున్నది. 350 పేజీల నివేదిక ఇన్ని ప్రశ్నలకు అనుమానాలకు తావు ఇచ్చే రీతిలో తయారు చేశారు. దీనివల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నం కాబోతున్నాయి. ఆలోచనల స్థాయిలోనే ఇన్ని సమస్యలు ఉండగా, అమలులో ఇంకెన్ని సమస్యలు రాబోతున్నాయో? ఉపాధ్యాయ సంఘాలను వారి సలహాలను పరిగణనలోనికి తీసుకోకుండా ఈ నివేదిక తయారైందని సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

# స్థానిక ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం


ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అనేవి ప్రజల ఆకాంక్షలకు, పరిపాలనా పారదర్శకతకు అద్దం పట్టే కీలక యంత్రాంగాలు. ముఖ్యంగా స్థానిక సంస్థలైన మున్సిపల్ ఎన్నికలు క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. అయితే, ఈ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం చూపే ఆర్థిక లెక్కలు, వాస్తవ వ్యయాల మధ్య కనిపిస్తున్న అగాధం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకు ప్రతి దశలోనూ వేల కోట్ల ప్రజాధనం వ్యయం అవుతున్నప్పటికీ, అందులో పారదర్శకత కొరవడటం ఆందోళనకరం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేయాలి, వారి ప్రచార వ్యయం ఎంత ఉండాలి అనే అంశాలపై నిశితంగా నిఘా ఉంచే ఎన్నికల సంఘం, అదే ఎన్నికలను నిర్వహిస్తున్న అధికారుల ఖర్చుల విషయంలో మౌనం వహించడం లేదా ఉదాసీనంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలోని వైరుధ్యాన్ని ఎత్తిచూపుతోంది. అభ్యర్థుల ఖర్చును నియంత్రించే యంత్రాంగం, అధికార యంత్రాంగం చేస్తున్న అనవసర వ్యయాలను, అక్రమ మళ్లింపులను ఎందుకు ప్రశ్నించడం లేదనేది ఒక అపరిష్కృత ప్రశ్నగా మిగిలి పోయింది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రధానంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రత, ఈవీఎంల రవాణా, ఓటర్ల అవగాహన వంటి విభాగాలకు భారీగా నిధులు కేటాయిస్తారు. మున్సిపల్ ఎన్నికల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే, క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు ఆడిట్ నిపుణుల విశ్లేషణల ప్రకారం, ఇందులో కనీసం 30 నుండి 40 శాతం మేర వ్యత్యాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు, ఒక పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలైన తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, పారిశుధ్యం కోసం కేటాయించినట్లు కాగితాలపై రాస్తారు. కానీ వాస్తవానికి అక్కడ కనీసం సౌకర్యాలు కూడా ఉండవు. తాత్కాలిక షామియానాలు, కుర్చీల అద్దెల పేరుతో మార్కెట్ ధర కంటే అత్యధికంగా బిల్లులు సృష్టించడం పరిపాటిగా మారింది. ఇలా లక్షల వరకు అక్రమ మళ్లింపు జరుగుతోందని అంచనా. ఇలాంటి చిన్న చిన్న వ్యత్యాసాలే రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయల అవినీతికి దారితీస్తున్నాయి. శిక్షణా తరగతుల పేరుతో ఏర్పాటు చేసే భోజన వసతులు, స్టేషనరీ కొనుగోళ్లలో కూడా భారీగా




కమిషన్లు చేతులు మారుతున్నాయి. భద్రతా ఏర్పాట్ల పేరుతో జరిగే వ్యయం మరీ విడ్డూరంగా ఉంటుంది. పోలీసు బలగాల రవాణా కోసం వాహనాల అద్దె, ఇంధనం పేరుతో చూపే ఖర్చులు ఆడిట్ పరిధిలోకి రాకపోవడం అవినీతికి రాజమార్గంగా మారుతోంది. ఒకే వాహనాన్ని రెండు మూడు విభాగాలకు వినియోగించినట్లు చూపి, వేర్వేరుగా బిల్లులు డ్రా చేయడం వంటి సంఘటనలు గతంలో అనేక ఆడిట్ నివేదికల్లో వెలుగుచూశాయి. అత్యవసర పరిస్థితి అనే సాకుతో టెండర్లు పిలవకుండానే నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించడం వల్ల ఖర్చు అమాంతం పెరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎన్నికల సంఘం అభ్యర్థులపై చూపే కఠినత్వం అధికారుల విషయంలో లేకపోవడం. అభ్యర్థి ప్రచార రథం ఖర్చు, టీ కప్పుల ఖర్చు, జెండాల సంఖ్యను లెక్కించే పరిశీలకులు, ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న ప్రజాధనం దుర్వినియో గాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్నది చర్చనీయాంశం. అభ్యర్థి ఖర్చుకు పరిమితి విధించడం వెనుక ఉన్న ఉద్దేశం "సమాన అవకాశాలు" కల్పించడం అయితే, అధికారుల అడ్డగోలు ఖర్చులను నియంత్రించడం వెనుక ఉన్న ఉద్దేశం "ప్రజాధన రక్షణ" కావాలి. కానీ, ఎన్నికల సమయం ముగియగానే యంత్రాంగం అంతా పద్దులను సర్దడంలో నిమగ్నమవుతుంది తప్ప, వాటిపై స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించిన దాఖలాలు తక్కువ. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (అంఉ) వంటి సంస్థలు సాధారణంగా వార్షిక ఆడిట్ చేస్తాయి కానీ, ఎన్నికల వంటి ప్రత్యేక సందర్భాల కోసం ప్రత్యేకమైన, వేగవంతమైన ఆడిట్ వ్యవస్థ లేకపోవడం పెద్ద లోపం. రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఈ వ్యయాలపై కచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేయాల్సిన అవసరం ఉంది. ఓటర్ల అవగాహన కార్యక్రమాల పేరుతో జరిగే ఖర్చు కూడా ఒక ప్రహసనంగా మారింది. హోర్డింగులు, గోడ పత్రికలు, ప్రచార వాహనాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నా, అవి కేవలం ప్రధాన కార్యాలయాలకే పరిమితం అవుతున్నాయి. మారుమూల వార్డుల్లో ఓటర్లకు కనీస సమాచారం కూడా అందడం లేదు. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా తక్కువ ఖర్చుతో అవగాహన కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, పాత పద్ధతిలో కాంట్రాక్టర్లకు మేలు చేసేలా భారీ వ్యయంతో కూడిన ప్రకటనలకే అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇఒఓ) రక్షణ, నిల్వ కోసం ఉపయోగించే స్ట్రాంగ్ రూమ్‌ల అద్దెలు, అక్కడ ఏర్పాటు చేసే సీసీటీవీల ఖర్చులు మార్కెట్ ధర కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వ్యవస్థాత్మక అవినీతికి నిదర్శనం. ఈ రకమైన వ్యయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం పడటమే కాకుండా, పరిపాలనా యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలుతోంది. ఈ దుస్థితిని మార్చాలంటే సమూల ప్రక్షాళన అవసరం. ప్రతి మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన బడ్జెట్ మరియు ఖర్చు చేసిన వివరాలను "ఓపెన్ డేటా" విధానంలో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎన్నికల నిర్వహణ ఖర్చుపై ఒక స్వతంత్ర ఆడిట్ కమిటీని నియమించి, ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోపు నివేదికను బహిర్గతం చేయాలి. అభ్యర్థుల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు నియమించినట్లుగానే, అధికార యంత్రాంగం ఖర్చును పర్యవేక్షించేందుకు "వ్యయ పరిశీలకులను" నియమించాలి. టెక్నాలజీని ఉపయోగించి ప్రతి కొనుగోలును ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారానే జరపాలి. ఒకవేళ ఏ అధికారి అయినా నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలితే, వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుంది. ప్రజాస్వామ్య విలువలు కాపాడబడాలంటే అటు అభ్యర్థులు, ఇటు అధికారులు ఇద్దరూ జవాబుదారీగా ఉండాలి. ప్రజాధనం ప్రజల అవసరాల కోసం ఖర్చు కావాలి కానీ, ఎన్నికల పేరిట అధికారుల జేబులు నింపడానికి కాదు. చైతన్యవంతమైన సమాజం ఈ వ్యత్యాసాలను ప్రశ్నించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

# యువతకు మేల్కొలుపు మంగళ్‌పాండే ఆత్మత్యాగం

బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం అలనాడు జరిగిన పోరాటంలో ఎందరో ధీరులు ప్రాణాలర్పించారు. తెల్లదొరలపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. ప్రాణాలకు లెక్కచేయక బ్రిటీష్ వారి మీద తుపాకీ ఎక్కు పెట్టిన ధైర్యవంతుడు. బ్రిటిష్ వారి పెత్తనానికి తలవొగ్గి వారు చేస్తున్న అరాచకాలు, అవమానాలు మౌనంగా భరించిన భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వైపు మళ్లించిన ఘనత మంగళ్ పాండేదే. బ్రిటిష్ పాలన నుండి దేశాన్ని విడిపించేందుకు తన ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడుగా మంగల్ పాండే భారత చరిత్రలో నిలిచి పోయాడు. 1857 నాటి తిరుగుబాటులో అతను కీలక పాత్ర పోషించాడు. మూడుపదుల వయసుకు చేరకుండానే ఉరికంబం ఎక్కేందుకు ఏ మాత్రం వెనకడుగు వేయని ధైర్యవంతుడు, తన త్యాగం దేశంలోని యువతను మేల్కొలుపు తుందని, విశ్వసించాడు. తన ఆత్మ బలిదానం మరెందరో వీరులకు స్ఫూర్తిని





కలిగిస్తుందని, అలా స్ఫూర్తిని పొంది భరతమాత దాస్య విముక్తికి అంకితం అవుతారని, ఆ దిశగా యత్నం చేస్తారని భావించాడు. సుమారు రెండు శతాబ్దాలు మన దేశాన్ని పాలించిన శ్వేత జాతీయులపై తిరుగు బాటును ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. మంగళ్ పాండే 1827 జూలై 19 న నేటి ఉత్తరప్రదేశ్ నందు గల ఫైజాబాద్ జిల్లాలోని సుర్హుపుర అను గ్రామంలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. 22 సంవత్సరాల వయసులో మంగళ్ పాండే తనకు తెలిసిన వ్యక్తి ద్వారా తాను సిపాయిగా చేరాడు. శిక్షణ అనంతరం పాండేని 34 బెంగాల్ రెజిమెంట్ లోని 6వ కంపెనీకి సిపాయిగా పంపించారు. సెలవులకు ఇళ్లకు వెళ్లి వచ్చిన సైనికుల ద్వారా బ్రిటీషు వారి దోపిడీలు, దేశమంతటా చెలరేగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం గురించి వార్తలు అందుతుండేవి. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న స్థానిక పాలకులు సంఘటితంగా బ్రిటిషు వారిపై 1857 మే 31 న తిరుగుబాటు జరపాలని నిర్ణయించుకున్నారు. ఈ తిరుగు బాటుకు నాయకత్వం వహించిన వారిలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, తాంతియా తోపె, బహదూర్ షా తదితరులు ఉండిరి. తుపాకీ తూటాల తయారీలో గోవు, పంది కొవ్వు వాడుతున్న విషయం సైనికులకి తెలిసి లోలోపల రగిలి పోయారు. గోమాంసం వాడకం గురించి తెలుసుకున్న మంగళ్ పాండే ఉడికిపోయి, తోటి సైనికులతో తిరుగు బాటుకు పథకం వేశాడు. ఈ విషయం బ్రిటిషు అధికారులు మార్చి 29 న గుర్తించారు. తమ తమ తుపాకీలని సిద్ధంగా ఉంచుకొని, కన్పించిన బ్రిటిషు అధికారినల్లా కాల్చి పారేయాలని తోటి సైనికులందర్నీ ఉత్తేజ పర్చాడు పాండే . ఈ లోగా అధికారి వాగ్ రావటం మంగళ పాండే అతనిమీద తూటా పేల్చటం జరిగింది, కానీ అది గురితప్పి అతని గుర్రానికి తగిలింది. చేతి పిస్టల్ తో కాల్పులు జరిపాడు వాగ్. తప్పించుకున్న మంగళ్ పాండే తిరగబడి, తన తుపాకీ తో కొట్టబోయాడు. అప్పటికే చేరుకున్న శార్జంట్ హ్యూసన్ వచ్చి పాండే చేతిలోని తుపాకీని నెట్టి పారేశాడు. పాండే ని అరెస్ట్ చేయమని అధికారులు ఆదేశించినా ఎవ్వరూ ముందుకు రాలేదు. తెల్లవారి చేతికి చిక్కటం ఇష్టం లేక, తన తుపాకీతో తానే కాల్చుకాగా, ఆ బుల్లెట్ గాయం చేసింది కానీ ప్రాణం తీయలేదు. తర్వాత భయంతో అతన్ని బ్రిటిషు అధికారులు సమీపించి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల్లో కోలుకున్న మంగళ్ పాండే మీద రాజద్రోహం, తిరుగుబాటు నేరాలు మోపి కోర్టులో హాజరు పరిచారు. వీలైనంత త్వరగా విచారణ ముగించటం, ఉరిశిక్ష విధించటం ఆంగ్లేయ పాలకుల దుర్నీతికి పరాకాష్ఠ. విచారణలో మంగళ్ పాండే ధైర్యంగా ఇలా ప్రకటించాడు... "నేను చేసిన తిరుగుబాటు నా దేశం కోసం, నా ధర్మం కోసం చేశాను. ఇది నా స్వప్రేరణతో నా మాతృభూమి కోసం చేశాను, అంతే కానీ దీనికి మరెవ్వరినీ బాధ్యులని చేయొద్దు". విచారణ పూర్తిచేసి, ఏప్రిల్ 18న ఉరితీయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే తిరుగుబాటు వార్త వ్యాపించి, అనేక రెజిమెంట్లలో చైతన్యం మొదలయ్యింది. మరోవైపు అనేక రాజ సంస్థానాలు, సంస్థానాల్లోని ప్రజలు తిరుగుబాటుకు ఏకమయ్యారు. భారత దేశమంతా ప్రథమ స్వతంత్ర్య సంగ్రామానికి తెర లేచింది. మంగళ్ పాండే ఉరి ప్రభావంతో సైనికుల్ని అణచి వేయటానికి ఏప్రిల్ 8 నే ఉరిశిక్షను అమలు చేశారు. మంగల్ పాండే ప్రభావమున్న సైనిక కంపెనీని పూర్తిగా రద్దు చేశారు. 2005 లో మంగళ్ పాండే పై ఒక హిందీ సినిమా తీసారు. భారత ప్రభుత్వం మంగళ్ పాండే గౌరవార్థం, అక్టోబరు 5, 1984 న ఒక తపాళా బిళ్ళను విడుదల చేసింది. భారత దేశ స్వాతంత్ర్య పోరాటపు తొలిసారి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన వీరుడు మంగళ్ పాండే. 1857 నాటి తిరుగు బాటుకు మూలమై, బ్రిటీష్ సిపాయిగా పనిచేస్తూ బ్రిటీష్ పాలకుల మీద తిరుగు బాటు చేసిన సాహసిగా, తొలి స్వాతంత్ర్య సమర యోధుడిగా పాండే చిరకాలం గుర్తుండి పోతాడు.

# పిల్లలు టూత్‌పేస్ట్ మింగేస్తున్నారా!



మీ పిల్లలు బ్రష్ చేసేటప్పుడు పేస్ట్‌ను మింగేస్తున్నారా? అయితే ఇది మీకు చేదు వార్తే.. మనం మామూలుగా తీసుకునే ఈ చిన్న విషయం, మీ పిల్లల మేధోశక్తిని తగ్గించడమే కాకుండా.. వారి ఎముకలను కూడా బలహీనపరుస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు బ్రష్ చేయించడం అనేది తల్లులకు ఒక పెద్ద యుద్ధం లాంటిదే. రంగురంగుల ప్యాకింగ్‌లు, తీపి రుచులతో వచ్చే టూత్‌పేస్ట్‌లను చూసి పిల్లలు వాటిని మింగేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. ఏదో ఒకసారి పొరపాటున మింగితే పర్వాలేదు కానీ ఇది అలవాటుగా మారితే మాత్రం వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. టూత్‌పేస్ట్‌లలో దంతాల రక్షణ కోసం వాడే ఫ్లోరైడ్, పరిమితికి మించితే విషతుల్యంగా మారుతుంది. దీర్ఘకాలం పాటు పేస్ట్‌ను మింగే అలవాటు ఉన్న పిల్లల్లో ఈ ఫ్లోరైడ్ ఎముకల్లోనూ శరీరంలోని ఇతర అవయవాల్లోనూ పేరుకుపోతుంది. దీనివల్ల రెండు ప్రధాన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. స్కెలిటల్ ఫ్లోరోసిస్: ఇది మరింత ప్రమాదకరమైనది. ఎముకలు పెళుసుగా మారి, చిన్న దెబ్బలకే విరిగిపోయే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో కీళ్ల నొప్పులకు ఇది దారితీస్తుంది. ఇటీవలి పరిశోధనల్లో తేలిన మరో షాకింగ్ విషయం ఏమిటంటే.. శరీరంలో ఫ్లోరైడ్ స్థాయిలు అధికమైతే పిల్లల మేధోశక్తి తగ్గే అవకాశం ఉంది. మెదడు ఎదుగుదలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు బ్రష్ చేసేటప్పుడు పేస్ట్ పరిమాణం విషయంలో తల్లిదండ్రులు ఈ నియమాలు తప్పక పాటించాలి.. 3 ఏళ్లలోపు పిల్లలకు: కేవలం ఒక బియ్యపు గింజంత పరిమాణం మాత్రమే. 3 నుండి 6 ఏళ్ల పిల్లలకు: ఒక బఠాణీ గింజంత మాత్రమే వాడాలి. మౌత్ ఫ్రెష్‌నర్లు: అత్యవసరమైతే తప్ప చిన్న పిల్లలకు మౌత్ వాష్‌లు లేదా ఫ్రెష్‌నర్లు వాడకపోవడమే మంచిది. ఫ్లోరైడ్ రహిత పేస్టు: చిన్న పిల్లలకు ప్రారంభంలో ఫ్లోరైడ్ ఫ్రీ టూత్‌పేస్ట్‌లను అలవాటు చేయడం ఉత్తమం. పర్యవేక్షణ: పిల్లలు బ్రష్ చేస్తున్నంత సేపు వారిపై నిఘా ఉంచాలి. పేస్ట్‌ను ఉమ్మివేయడం వారికి నేర్పించాలి. తియ్యని రుచులకు దూరంగా: మరీ ఎక్కువ తీపి లేదా ఫ్రూట్ ఫ్లేవర్స్ ఉన్న పేస్ట్‌ల కంటే తక్కువ రుచి ఉన్న వాటిని ఎంచుకుంటే వారు తినడానికి ఇష్టపడరు. కూర్చుని కాకుండా: పిల్లలకు బ్రష్ చేయించేటప్పుడు వారి తల కొంచెం ముందుకు వంగి ఉండేలా చూస్తే పేస్ట్ లోపలికి వెళ్లే అవకాశం తగ్గుతుంది. పిల్లల చిరునవ్వు ఎంత ముఖ్యమో, వారి ఆరోగ్యం అంతకంటే ముఖ్యం. పేస్ట్ రుచిగా ఉందని వారు తింటుంటే ముచ్చటపడకుండా, దానివల్ల కలిగే అనర్థాలను గుర్తించి జాగ్రత్తపడండి.

# మజ్జిగ తాగితే మంచిదా!





పెరుగు, మజ్జిగ... దాదాపు ఒకే రకమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, ఈ రెండింటిలో ఏది మంచిది అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. కేవలం పెరుగుకు నీళ్ళు కలపడం ద్వారా దానిని మజ్జిగగా మార్చవచ్చు. కానీ అలా చేయడం వల్ల పెరుగు గుణాలు కూడా మారుతాయా? సమాధానం అవును. వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి పెరుగు, మజ్జిగ రెండూ మంచివే అయినప్పటికీ, వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఏది ఉత్తమమో చూద్దాం. ఎండలు మండిపోతున్న వేళ మన ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం చాలా అవసరం. వేసవిలో చల్లదనం కోసం అందరూ పెరుగు లేదా మజ్జిగను ఆశ్రయిస్తారు. అయితే ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో తప్పక తెలుసుకోవాలి. పెరుగు , మజ్జిగ రెండూ పాల ఆధారిత ఉత్పత్తులే. ఒకే కూర్పును కలిగి ఉంటాయి. దాదాపు ఒకే రకమైన పోషకాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ, ఈ రెండింటిలో ఏది మంచిది అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. కేవలం పెరుగుకు నీళ్ళు కలపడం ద్వారా దానిని మజ్జిగగా మార్చవచ్చు. కానీ అలా చేయడం వల్ల పెరుగు గుణాలు కూడా మారుతాయా? సమాధానం అవును. 1. హైడ్రేషన్: మజ్జిగలో దాదాపు 90 శాతం నీరు ఉంటుంది. ఎండల వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గినప్పుడు మజ్జిగ తాగడం వల్ల తక్షణమే శక్తి వస్తుంది. పెరుగు చిక్కగా ఉండటం వల్ల అది శరీరానికి నీటిని అందించడంలో మజ్జిగ అంత ప్రభావవంతంగా ఉండదు. 2. జీర్ణక్రియ : పెరుగు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇది కొన్నిసార్లు వేసవిలో కడుపులో భారాన్ని కలిగిస్తుంది. మజ్జిగ తేలికగా జీర్ణం కావడమే కాకుండా, మనం తిన్న ఆహారం త్వరగా అరగడానికి సహాయపడుతుంది. మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి, అల్లం కలిపితే జీర్ణశక్తి రెట్టింపు అవుతుంది. 3. శరీర ఉష్ణోగ్రత: ఆయుర్వేదం ప్రకారం, పెరుగు స్వభావరీత్యా కొంత వేడిని కలిగిస్తుంది. కానీ దానిని చిలికి మజ్జిగలా మార్చినప్పుడు అది శీతలీకరణ ప్రభావాన్ని ఇస్తుంది. అందుకే వేసవిలో పెరుగు కంటే మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. 4. బరువు నియంత్రణ: పెరుగులో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు లేదా క్యాలరీలను తగ్గించుకోవాలనుకునే వారు మజ్జిగను ఎంచుకోవడం ఉత్తమం. ఇందులో ప్రోటీన్లు ఉన్నప్పటికీ క్యాలరీలు చాలా తక్కువ. 5. పోషక విలువలు: ఎముకల బలానికి, దంతాల ఆరోగ్యానికి అవసరమైన క్యాల్షియం పెరుగులో పుష్కలంగా ఉంటుంది. మీకు క్యాల్షియం లోపం ఉంటే పెరుగు మంచిది. కానీ ఎండల నుండి ఉపశమనం కావాలంటే మాత్రం మజ్జిగనే మేలు. మొత్తానికి వేసవిలో మజ్జిగ సంపూర్ణ పానీయం. అయితే మీరు పెరుగు తినాలనుకుంటే మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం మంచిది, రాత్రిపూట పెరుగు తినడం వల్ల శ్లేష్మం పెరిగే అవకాశం ఉంది. ప్రతిరోజూ కనీసం రెండు గ్లాసుల పలచని మజ్జిగ తాగడం వల్ల మీ ఆరోగ్యం

# పుదీనా చట్నీతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..





ఖబీటతినిజీ అష్ట్రబీబినివఎ ఃవనివటతిబిబ: వేసవిలో పుదీనా శరీరాన్ని చల్లబరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అడాప్టోజెన్ గుణాలు కలిగిన పుదీనా.. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి, ఫైబర్‌తో నిండి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని కాపాడటానికి పుదీనా చట్నీని తినమని, పుదీనా పానీయాలు తాగమని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నుండి మన శరీరాన్ని రక్షించుకోవడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పుదీనా (ఓతినిబి ఒవజీలవబ) అద్భుతంగా పనిచేస్తుంది. ఈ కాలంలో ఏది పడితే అది తినడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. అందుకే పుదీనాతో చేసే వంటకాలు, ముఖ్యంగా పుదీనా చట్నీని తీసుకోవడం వల్ల ఆరోగ్యం, చల్లదనం లభిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పుదీనా పానీయాలు వేసవిలో మన శరీరానికి ఉపశమనం కలిగిస్తాయి. పుదీనా ఆకుల్లో అడాప్టోజెన్ గుణాలు ఉంటాయి. ఇవి వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పుదీనాలోని శీతలీకరణ శక్తి శరీరంలోని వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో చల్లగా ఉండటానికి చాలామంది చల్లటి పదార్థాలను ఆశ్రయిస్తారు. కానీ అవి కొన్నిసార్లు ఆరోగ్యానికి హానికరంగా మారవచ్చు. అలాంటి సందర్భాల్లో, రుచి, ఆరోగ్యం రెండింటినీ పుదీనా వంటకాలు, పానీయాలు అందిస్తాయి. ఆహారపు రుచిని పెంచే పుదీనా చట్నీని వేసవిలో ఎక్కువగా తినమని ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా సిఫార్సు చేస్తారు. ఇది కేవలం రుచి కోసమే కాకుండా, కడుపు ఆరోగ్యానికి కూడా మంచిదని నమ్ముతారు. పుదీనా చట్నీ కడుపు ఆరోగ్యానికి ప్రయోజనకరమైన ఔషధంగా పరిగణించబడుతుంది. ఇది శరీరాన్ని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వేసవిలో జీర్ణక్రియ, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుదీనాలో సహజసిద్ధంగా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పిప్పర్ మెంట్ లోని శీతలీకరణ శక్తి పేగు ఆరోగ్యాన్ని శాంతపరచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, దీనిలోని యాంటీ-బాక్టీరియల్, యాంటీ-సెప్టిక్ లక్షణాలు పేగు సూక్ష్మజీవులను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడతాయి. పుదీనా చట్నీలో విటమిన్-సి, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఈ సాంప్రదాయ చట్నీ తయారీలో ఉపయోగించే మూలికలు, సుగంధ ద్రవ్యాల మిశ్రమం పేగు ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఇంట్లో పుదీనా చట్నీని తయారు చేసుకోవడం చాలా సులభం. ముందుగా పుదీనా ఆకులను శుభ్రంగా కడిగి నీటిలో నానబెట్టి, ఆపై వడకట్టి బాగా కడగాలి. ఆ తర్వాత ఒక బ్లెండర్ తీసుకుని అందులో పుదీనా ఆకులు, మూడు వెల్లుల్లి రెబ్బలు, ఒక అంగుళం అల్లం, రెండు పచ్చిమిర్చి వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. చాట్ మసాలాతో పాటు ఉప్పు, ఎండుమిర్చి, నిమ్మరసం జోడించి మళ్లీ బ్లెండ్ చేసి తాజా చట్నీని ఆస్వాదించండి. వేసవిలో ఈ చట్నీని ఫ్రిడ్జ్లో నిల్వ చేసి చాలా రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు.

# మామిడి పండ్లు ఇలా తింటే ఆస్పత్రికి పరుగెత్తాల్సిందే!



వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు.. వేసవి ప్రారంభమైంది. పండ్ల రారాజు మామిడి. వేసవిలో మాత్రమే దొరికే మామిడి పండ్లు ఎంత తినాలి? ఒక రోజులో ఎన్ని మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది? మామిడిని సరైన పద్ధతిలో ఎలా తినాలి అనే సందేహాలు మనలో చాలా మందికి ఉంటాయి. మామిడి పండ్లు రుచిగా ఉండటమే కాకుండా వాటిలో విటమిన్లు ఎ, సి, అనేక ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. అయితే మామిడి పండ్లు అందరికీ మేలు చేయవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మామిడి పండ్లు తినడం ప్రమాదకరం. మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తుంటే మామిడి పండ్లు కాస్త మితంగా తినాలి. మామిడి పండ్లలో కేలరీలు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు మామిడి పండు సుమారు 150 నుంచి 200 కేలరీలను అందిస్తుంది. దీనివల్ల బరువు పెరగవచ్చు. మామిడి పండ్లలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మంచిదని భావిస్తారు. అయితే, మామిడి పండ్లను ఎక్కువగా తినడం వల్ల విరేచనాలు లేదా గ్యాస్ రావచ్చు. తరచుగా కడుపు సంబంధిత సమస్యలతో బాధపడేవారు మామిడి పండ్లను పరిమితంగా తినాలి. మామిడి తొక్క లేదా దానిలోని కొన్ని పదార్థాల వల్ల కొంతమందికి చర్మం దురద, దద్దుర్లు, కళ్ళు ఎర్రబడటం వంటి అలెర్జీ ప్రతిచర్యలు కలుగుతాయి. అలాంటి వారు జాగ్రత్తగా ఉండాలి. మామిడిని అధికంగా తినడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరగవచ్చు. దీనివల్ల కీళ్లనొప్పులతో బాధపడే రోగులలో నొప్పి పెరగవచ్చు. మామిడి పండ్లను తినడానికి ముందు కనీసం 1-2 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. దీనివల్ల వాటిలోని రసాయనక ప్రతిచర్యలు తగ్గుతాయి. రాత్రి పడుకునే ముందు మామిడి పండ్లు తినడం మానుకోవాలి. ఎందుకంటే దీనివల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మామిడి పండ్లలో తగినంత సహజ చక్కెర ఉంటుంది కాబట్టి వీటిని తినేటప్పుడు వాటికి చక్కెర కలపడం అంత మంచిదికాదు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజుకు ఒక మధ్యస్థ పరిమాణంలో ఉన్న మామిడి పండు తింటే సరిపోతుంది. ఒకవేళ మీరు మామిడి పండ్ల ముక్కలు తింటుంటే రోజుకు ఒక చిన్న గిన్నెడు మామిడి పండ్లు తింటే సరిపోతాయి.

# వేసవిలో ముక్కు నుండి రక్తం కారుతోందా?



వేసవి కాలం వచ్చిందంటే చాలు.. ఎండలతో పాటు రకరకాల ఆరోగ్య సమస్యలు మనల్ని చుట్టుముడతాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మన శరీరంలో కూడా వేడి పెరుగుతుంది. ఈ క్రమంలో చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య 'ముక్కు నుండి రక్తం కారడం' (ఔనీబవఎశ్రీవవట). అకస్మాత్తుగా ముక్కు నుండి రక్తం రావడం చూసి ఎవరైనా భయపడటం సహజం. ఎండాకాలంలో డీహైడ్రేషన్ సమస్య ఎంత సహజమో ఇది కూడా అంతే కామన్. ఇతర నమ్మకాలతో దీనికి సంబంధం లేదు. ఇది పూర్తిగా వాతావరణ మార్పులు శరీర స్థితిపై ఆధారపడి ఉంటుంది. ముక్కు లోపలి పొర చాలా సున్నితంగా ఉంటుంది. పొడి గాలి: వేసవిలో గాలిలో తేమ తగ్గిపోయి, వేడి మరియు పొడి గాలి వీస్తుంది. దీనివల్ల ముక్కు లోపలి సున్నితమైన రక్తనాళాలు ఎండిపోయి చిట్లిపోతాయి. శరీర ఉష్ణోగ్రత: బయట ఉష్ణోగ్రత పెరిగినప్పుడు శరీరంలో కూడా వేడి పెరిగి రక్తనాళాలపై ఒత్తిడి పడుతుంది. ఇతర కారణాలు: అలర్జీలు, సైనస్ ఇన్ఫెక్షన్లు, ముక్కులో వేలు పెట్టుకోవడం లేదా గట్టిగా తుమ్మడం వల్ల కూడా రక్తస్రావం జరగవచ్చు. అధిక రక్తపోటు ఉన్నవారిలో కూడా ఈ సమస్య కనిపిస్తుంది. నిటారుగా కూర్చోండి: పడుకోవడం కంటే నిటారుగా కూర్చోవడం మంచిది. తలను కొద్దిగా ముందుకు వంచండి (వెనక్కి వంచకూడదు). ముక్కును నొక్కండి: బొటనవేలు, చూపుడు వేలుతో ముక్కులోని మెత్తని భాగాన్ని 10 నుండి 15 నిమిషాల పాటు గట్టిగా నొక్కి పట్టుకోండి. ఐస్ ప్యాక్: ముక్కు పైన లేదా నుదుటిపై ఐస్ ముక్కలు లేదా చల్లటి పట్టీని ఉంచండి. ఇది రక్తనాళాలను సంకోచింపజేసి రక్తస్రావాన్ని ఆపుతుంది.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి

# ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలి

**ఆదిలాబాద్ :** ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల కార్యక్రమానికి ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల శంకర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేసి ఆరోగ్య ఆదిలాబాదుగా తీర్చిదిద్దాలని, నిన్నటి నుండి ప్రారంభమైన ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సేఫ్ మదర్ హుడ్, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ వంటి అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి జిల్లాకే కాకుండా పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కొనియాడారు. ముఖ్యంగా సర్జికల్ ఆంకాలజీ విభాగంలో జరుగుతున్న శస్త్రచికిత్సలు, శిశు మరణాల రేటును తగ్గించేందుకు చేపట్టిన 'సంకల్ప' ప్రోగ్రామ్ ద్వారా రిమ్స్ కు జాతీయ స్థాయి గుర్తింపు, టీబీ నివారణలో జిల్లా యంత్రాంగం సాధించిన పురోగతికి గాను అవార్డులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయి నుండే పిల్లలు గుట్కా, పాన్ మసాలా, మద్యం, గంజాయి వంటి అలవాట్లకు లోనవుతుండటం ఆందోళనకరమని, ఇటువంటి వారిని గుర్తించి రిమ్స్ లేదా స్వచ్ఛంద సంస్థలు నడిపే డి-అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అలాగే గర్భిణీ స్త్రీలలో రక్తహీనత (అనిమియా) సమస్య తీవ్రంగా ఉందని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను సక్రమంగా వాడేలా చూడాలన్నారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరమైన యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, తగినంత నీరు తాగడం, 6 నుండి 7 గంటల నిద్ర, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ యోగా, వ్యాయామం వంటివి అలవర్చుకోవాలని సూచించారు. ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, మానవ జీవితం చాలా స్వల్పమైనదని, డబ్ల్యూహెచ్ఓ నివేదికల ప్రకారం సగటు జీవితకాలం 60 నుండి 70 ఏళ్లకు తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇది కేవలం సంబరాల కోసం కాకుండా మన ఆరోగ్యంపై




మనకు అవగాహన కలిగించే 'అలారం' వంటిదని పేర్కొన్నారు. నేటి సమాజంలో 30-40 ఏళ్లకే అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగితే ప్రభుత్వం వైద్యం కోసం చేసే భారీ ఖర్చు తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాత్ర కీలకమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్యులను ఎంతగానో నమ్ముతారని, వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలోని ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సకు పరిమితం కాకుండా హై డోస్ మందులు, పెయిన్ కిల్లర్లు ఇవ్వడం వల్ల ప్రాణాపాయం సంభవిస్తోందని హెచ్చరించారు. గతంలో బజార్ హత్నూర్, గాదిగూడ వంటి మండలాల్లో కిడ్నీ సమస్యలతో పలువురు మృతి చెందడానికి విదేశాల నుండి వచ్చిన అనర్హులైన వ్యక్తులు చేసే వైద్యమే కారణమని గుర్తు చేశారు. యువత గంజాయి, గుట్కా, సిగరెట్లు వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారని, దీనిపై కఠిన నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ నడక, యోగా ధ్యానం వంటి అలవాట్లను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ అందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మనిషి ఏ రంగంలో ఉన్నా విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి నుండి బయటపడాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా మనం తీసుకునే ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, నడక వంటి అంశాలను సమన్వయం చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అని, 2014-15లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగా ప్రాముఖ్యతను ప్రపంచ వేదికలపై చాటిచెప్పినప్పుడు మొదట్లో కొందరు విమర్శించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే, ఐక్యరాజ్యసమితిలో యోగాను గుర్తించిన తర్వాత, శాస్త్రీయంగా దీనివల్ల మందుల వాడకం దాదాపు 44 శాతం తగ్గిందని అనేక పరిశోధనలు నిరూపిస్తున్నాయని వివరించారు. యోగాను అలవరచుకోవడం ద్వారా సుమారు 50 నుండి 60 శాతం వరకు రోగాల బారిన పడకుండా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, తప్పనిసరిగా సమయానికి ఆహారం, నిద్ర తీసుకోవాలని సూచించారు. బయట ఫుడ్ తీసుకోకుండా ఆరోగ్య పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా టిబి నియంత్రణపై ప్రతిజ్ఞ చేసి, ఆయుష్ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. తదుపరి ఉత్తమ వైద్య సేవలు అందించిన పలువురు వైద్యులకు, సిబ్బందికి, నిక్షయ మిత్రాలకు కలెక్టర్, ఎంపీ ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం నూతన టిబి ఎక్స్ రే యంత్రాన్ని కలెక్టర్, ఎంపీ ఆవిష్కరించి, టిబి వ్యాధిగ్రస్థులకు నిక్షయా పోషన్ కిట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, లీగల్ అడ్వైజర్ దాసరి గంగారం, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 83 కారుపై 95 చలాన్లు...

## పైసలు వసూలు చేసిన ట్రాఫిక్ పోలీసులు

**హైదరాబాద్, :** ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ.. పోలీసులకు సవాల్ విసురుతున్న ఓ వాహనదారుడిని ఎట్టకేలకు పట్టుకున్నారు. ఒకే కారుపై 95 ట్రాఫిక్ చలాన్లు ఉండగా.. గత ఏడాదిన్నర కాలంగా ట్రాఫిక్ పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్నాడు. పోలీసులకు దొరకకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరికి దొరికిపోయాడు. చలాన్ల సొమ్ము చెల్లించాలని పోలీసులు అడిగినా.. అతడు కట్టకపోవడంతో.. వాహనాన్ని సీజ్ చేసి.. స్టేషన్కు తీసుకెళ్లారు. కొందరు వాహనదారులు.. ట్రాఫిక్ చలాన్లను తప్పించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అయితే రోడ్లపై ట్రాఫిక్ ఉల్లంఘనలు చేస్తూనే.. పోలీసులకు దొరకకుండా తిరుగుతూ ఉంటారు. ఒక వ్యక్తి.. తన కారు వైట్ నంబర్ ప్లేట్ ఉన్నప్పటికీ.. ప్రయాణికులను ఎక్కించుకుని టాక్సీ కారు లాగా వాడుకుంటున్నట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. అదే సమయంలో రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తూ.. ఏకంగా 95 చలాన్లు పడే వరకు కూడా పోలీసులకు దొరకనేలేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆ వాహనం ఓనర్ను పట్టుకుని కారును సీజ్ చేసినట్లు ఎల్బీ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెల్లడించారు. పొలదాసు సురేష్ అనే వ్యక్తి.. తన మారుతి సుజుకీ ఎర్టిగా కారు వైట్ నంబర్ ప్లేట్ (టీజీ 09 ఉఇ 7619) ఉన్నప్పటికీ హైదరాబాద్ ఎల్బీ నగర్ నుంచి సూర్యాపేటకు నిత్యం ప్రయాణికులను తరలిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. విజయవాడ వెళ్లే రోడ్డుపై ట్రాఫిక్ ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో చెకింగ్ చేస్తుండగా ఆ కారుపై 95 ట్రాఫిక్ చలానాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మొత్తం చలానాలకు కలిపి రూ.36,600 ఫైన్లు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. పొలదాసు సురేష్.. గతంలో ట్రాఫిక్ పోలీసుల నుంచి 3 సార్లు తప్పించుకున్నాడని వివరించారు. అతి వేగం, నో పార్కింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్



వంటి ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలు రోజూ చేస్తూనే ఉన్నట్లు గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు.. ఆ వాహనాన్ని పట్టుకునేందుకు స్పెషల్ దృష్టి పెట్టారు. ఇప్పటికే పలుమార్లు తప్పించుకున్నప్పటికీ.. ఎట్టకేలకు ఆదివారం రోజున పొలదాసు సురేష్ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి.. అనంతరం పోలీసులు కారును సీజ్ చేశారు. ఇక అతడి కారుపై ఉన్న పెండింగ్ చలాన్లను చూసిన పోలీసులు షాక్ అయ్యారు. మొత్తం 95 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించిన పోలీసులు.. ఏకంగా 95 చలాన్లు ఉన్నాయని చూసి షాక్ అయ్యారు. ఇక ఆ చలాన్ల జరిమానా మొత్తం చెల్లించాలని ట్రాఫిక్ పోలీసులు పొలదాసు సురేష్కు సూచించగా అతడు నిరాకరించాడు. దీంతో ఆ కారును సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇక మంగళవారం రోజున కారుతోపాటు సురేష్ను కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ కారుపై కేవలం 14 చలాన్లు మాత్రమే ఉన్నాయి. వాటి మొత్తం రూ.10,555గా ఉంది. అయితే మిగిలిన కొన్ని చలాన్లను ట్రాఫిక్ పోలీసులు.. పొలదాసు సురేష్తో కట్టించినట్లు తెలుస్తోంది. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ.. తప్పించుకు తిరుగుతున్న వాహనదారులు ఎప్పటికైనా తమ చేతికి చిక్కుతారని దొరుకుతారని ట్రాఫిక్ పోలీసులు వార్నింగ్ ఇస్తున్నారు.

## విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలి

**రాజన్న సిరిసిల్ల** ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, కిచెన్ లో ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమ కుటుంబంలో పిల్లలకు ఆహార పదార్థాలు ఎలా సిద్ధం చేస్తారో అలాగే ఇక్కడ విద్యార్థుల కోసం వండాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులం దరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా.. ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం.. అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

– జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

గోదావరి పుష్కరాల పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ పరిశీలన




**జగిత్యాల :** జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించింది. ఈ పరిశీలనకు ఇంజినీర్-ఇన్-చీఫ్ జనరల్ ఓ.వి. రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, ఘాట్ల అభివృద్ధి పనులు, రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సరఫరా, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఈ.ఈ.పి.ఆర్. లక్ష్మణ్ రావు, ఈ.ఈ. ఆర్ అండ్ బి శ్రీనివాస్, ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్, నీటి పారుదల శాఖ అధికారుల, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ

**హైదరాబాద్, ఏప్రిల్ 7**

తెలంగాణలో వాలంటీర్ల వ్యవస్థను తీసుకురానున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ముగ్గురు చొప్పున మొత్తం 30 వేల మందిని నియమించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో భూసారాన్ని పరిరక్షించేందుకు ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లు పనిచేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపికైన తొలి దశ వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులు రసాయనాలను తగ్గించి.. భూసారాన్ని కాపాడేందుకు ఈ వాలంటీర్లు పనిచేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భూసారాన్ని కాపాడేందుకు భూసార ఆరోగ్య వాలంటీర్లు ( సాయిల్ హెల్త్ వాలంటీర్లు )ను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30 వేల మంది ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లను నియమిస్తామని.. ఇందులో భాగంగానే తొలి విడతలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎంపికైన వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్), తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈ వాలంటీర్లకు శిక్షణ ఇస్తోంది ఇక్రిశాట్లో తొలి విడత సాయిల్ వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. తెలంగాణలో రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి.. సేంద్రియ ఎరువులను వాడటాన్ని పెంచాలని సూచించారు. భూమి రసాయనాలు లేకుండా ఆరోగ్యంగా ఉంటేనే.. పండించిన పంటలో పౌష్టికాహారం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు జీలుగ, పిల్లిపెసర సహా ఇతర పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూ సారాన్ని పెంచాలని హితవు పలికారు. పంట కోసిన తర్వాత వాటి అవశేషాలను పొలాల్లోనే తగలబెట్టకుండా.. ఎరువులుగా ఉపయోగించాలని రైతులకు మంత్రి తుమ్మల తెలిపారు. భూసార ఆరోగ్య పరిరక్షణను ఒక ఉద్యమంలా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు వాలంటీర్ల చొప్పున కేటాయించనున్నట్లు వివరించారు. ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లు.. తమ పరిధిలో ఉన్న రైతులకు భూసారం ఎలా కాపాడాలి.. పంటకు భూమిని ఎలా తయారు చేయాలి అనే దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను తీసుకువచ్చే నైపుణ్యాలను నేర్పిస్తారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే రైతు ఉత్సవాల్లో అన్నదాతలు భారీగా పాల్గొనేలా చూడాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంతకుముందు ఇక్రిశాట్లోని వ్యవసాయ క్షేత్రాలను ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్.. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సహా పలువురు అధికారులతో కలిసి.. మంత్రి సందర్శించారు.

## ఏప్రిల్ 12 తర్వాత ఇంటర్ రిజల్ట్స్

**హైదరాబాద్ :** ప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇంటర్ ఫలితాల విడుదలపై సస్పెన్స్ కొనసాగుతుంది. ఈ వారం ఫలితాలు వస్తాయని ఆశించిన విద్యార్థులు మరికొన్ని రోజులు నిరీక్షించక తప్పదు. తాజా సమాచారం ప్రకారం.. వచ్చే వారం తెలంగాణ ఇంటర్ ఫలితాలు




విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్ 12 నుంచి 15వ తేదీ మధ్యలో ఫలితాలను వెల్లడించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఫలితాల విషయంలో ఇంటర్ బోర్డు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఎలాంటి సాంకేతిక లోపాలు లేదా మార్కుల లెక్కింపులో తప్పులు దొర్లకుండా డబుల్ చెక్ పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి వాల్యుయేషన్ పూర్తయినప్పటికీ, అత్యున్నత ప్రమాణాల కోసం మరోసారి ఫలితాలను పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా కేవలం ఒకే ఒక్క పేపర్లో ఫెయిల్ అయిన విద్యార్థుల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అటువంటి విద్యార్థుల సమాధాన పత్రాలను మరోసారి రీ-వాల్యుయేషన్ చేయిస్తున్నారు. దీనివల్ల పొరపాట్లు జరిగి విద్యార్థులు నష్టపోకుండా ఉండే అవకాశం ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బోర్డు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఫలితాల వెల్లడికి సంబంధించి ప్రభుత్వం నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. వచ్చే వారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షెడ్యూల్, ఆయన లభ్యత ఆధారంగా ఫలితాల తేదీని అధికారికంగా ఖరారు చేయనున్నారు. సిఎం చేతుల మీదుగా ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఫలితాలు విడుదలైన వెంటనే విద్యార్థులు టీవీ9 తెలుగు వెబ్ సైట్తో పాటు అధికారిక వెబ్ సైట్లలో తమ మార్కులను చూసుకోవచ్చు. మొత్తానికి స్కాన్ కాపీల అప్ లోడింగ్, డేటా ప్రాసెసింగ్ అంతా వేగంగా జరుగుతుండటంతో, విద్యార్థులు తమ ఫలితాల కోసం సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## బిజినెస్

### యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం



పశ్చిమాసియా సంక్షోభంతో, దేశీయంగా ప్రభావితమైన రంగాలకు మద్దతు ఇవ్వడానికి, మూలధన వ్యయాల్ని పెంచడానికి ప్రభుత్వానికి తగినంత ద్రవ్యపరమైన వెసులుబాటు ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. యుద్ధం వల్ల తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లు మరింత తగ్గించేందుకు వీలుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా మెరుగైన విధానాలు అనుసరించిన ఫలితం ఇప్పుడు కలిసొస్తోందని పేర్కొన్నారు. అధిక అప్పులు, భారీ ద్రవ్యలోటు కలిగిన అనేక దేశాలు ప్రస్తుత సంక్షోభ సమయంలో ఇబ్బంది పడుతున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) కార్యక్రమంలో మంత్రి వివరించారు. దశాబ్ద కాలంగా ద్రవ్య క్రమశిక్షణ పాటించినందునే.. ముడిచమురు ధర 50% పెరిగినా, మన దేశంలో డీజిల్, పెట్రోల్ రిటెయిల్ ధరలు పెంచలేదని, కీలక పెట్రో ఉత్పత్తులకు, దేశీయ టారిఫ్ ప్రాంతంలో పని చేసే ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజెడ్)కు నిర్దిష్ట మినహాయింపులు ఇచ్చినట్లు వివరించారు. మార్చి 26న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించడాన్నీ గుర్తు చేశారు. ఎగుమతులను నిరుత్సాహ పరచి, దేశీయంగా సరఫరాల్లో కొరత లేకుండా చూసేందుకు డీజిల్‌పై లీటరుకు రూ.21.50, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకాన్ని విధించామన్నారు.

### ఎయిరిండియా సిఇఒ విల్సన్ రాజీనామా



ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారు. 2022 జనవరిలో టాటా గ్రూప్ ప్రభుత్వం నుండి ఎయిరిండియాను స్వాధీనం చేసుకుంది. 2022 మార్చిలో తలెత్తిన వివాదం నేపథ్యంలో, టర్కిష్ ఎయిర్‌లైన్స్ మాజీ చైర్మన్ ఇల్కర్ అయ్సి ఎయిరిండియా సిఇఒ పదవిని స్వీకరించేందుకు నిరాకరించడంతో అదే ఏడాది జులైలో విల్సన్ ఎయిరిండియా సిఇఒ, ఎండిగా నియమితులయ్యారు. విల్సన్ రాజీనామా చేయాలనే తన నిర్ణయాన్ని వ్యక్తం చేశారని, ఆ విషయాన్ని బోర్డుకు తెలిపారని, వెంటనే రాజీనామా చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. విల్సన్ పదవీకాలం 2027తో ముగియనున్నప్పటికీ.. ముందుగానే ఆయన రాజీనామా చేశారని అన్నారు. ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ తన పదవీకాలం పూర్తి కావడంతో వైదొలిగారు. దీంతో ఈ ఏడాది మార్చి 19 నుండి ఆ పదవి ఖాళీగానే ఉంది. గతేడాది జూన్12న లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ నుండి బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయిన సంగతి తెలిసిందే. 242 మంది ప్రయాణికుల్లో ఒకరు మినహా మిగిలిన వారంతా ఆ ప్రమాదంలో మరణించారు. ఈ ఘటనపై విల్సన్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు.

### పిఎన్‌బి కస్టమర్లకు అలర్ట్..
### ఈనెల 15 తర్వాత ఆ ఖాతాలు క్లోజ్!

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కస్టమర్లకు బిగ్ అలర్ట్. మూడు సంవత్సరాలుగా ఎలాంటి ట్రాన్సాక్షన్స్ జరపని ఖాతాలు, జీరో బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లను క్లోజ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంది పంజాబ్ నేషనల్ బ్యాంక్. ఈ నెల 16వ తేదీ నుంచి ట్రాన్సాక్షన్ జరగని ఖాతాలను క్లోజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఖాతాలు ఇనాక్టివ్ గా ఉండటం వల్ల మోసాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని ఈ సందర్భంగా వెల్లడించింది. ఒకవేళ వినియోగదారులు తమ అకౌంట్లు కొనసాగించాలని కుంటే ఈ నెల 15వ తేదీలోపు కేవైసీ అప్డేట్ చేసుకోవాలని సూచనలు చేసింది. దాంతో పాటు మనీ ట్రాన్జక్షన్స్ కూడా రెగ్యులర్ గా చేయాలని కోరింది.

# భారత వృద్ధి అంచనాలకు కోత



ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన వనరుల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలతో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి తగ్గొచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత జీడీపీని గతంలో అంచనా వేసిన 7.2 శాతం నుంచి 6.8-6.9 శాతానికి తగ్గిస్తున్నట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులో తలెత్తిన అవరోధాలు దేశీయ ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి అవసరమైన ఇంధన సరఫరాపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. "పారిశ్రామిక ఇంధన సరఫరాపై ఆంక్షలు ఉన్నందున, గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల ఎరువులు, సిరామిక్స్, లోహాలు, గాజు వంటి రంగాల ఉత్పత్తి ప్రభావితమయ్యే అవకాశం ఉంది" అని ఐసీఐసీఐ బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. గతంలో 2022లో ఇంధన ధరలు పెరిగినప్పుడు తయారీ రంగం ఏ విధంగా మందగించిందో గుర్తు చేసింది. ప్రస్తుతం మార్చి నెల తయారీ పీఎంఐ 53.9కి పడిపోవడం తక్షణ ప్రభావానికి నిదర్శనమని పేర్కొంది.విదేశీ వాణిజ్యం, చమురు ధరల ప్రభావంపై ఐసీఐసీఐ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల వద్ద కొనసాగడం వృద్ధికి ప్రతికూలమని తెలిపింది. చమురు ధరలు 111 డాలర్ల వద్ద ఉన్నప్పుడు (2012-14) వాస్తవ జీడీపీ 5.7 శాతానికి పడిపోయిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రస్తుతం సరఫరా పరిమితులు హార్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఎగుమతులు దెబ్బతినడం వంటి అంశాలు 2025-26లోని నాలుగో త్రైమాసికం, 2026-27లో మొదటి త్రైమాసికంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఐసీఐసీఐ బ్యాంక్ తన నివేదికలో వెల్లడించింది. ఎగుమతుల్లో 15 శాతం వాటా ఉన్న గల్ఫ్ దేశాలకు రవాణా నిలిచిపోవడం కూడా ఈ వృద్ధి కోతకు మరో ప్రధాన కారణమని తెలిపింది.

# 2030కి మరో 25 లక్షల ఉద్యోగాలు



దేశీయ ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో 2030 నాటికి 20-25 లక్షల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఉద్యోగ కన్సల్టెన్సీ సంస్థ అడెకో ఇండియా అంచనా వేసింది. ఈ రెండు రంగాలు సామర్థ్య-ఆధారిత వృద్ధి దశలోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొంది. కార్మిక శక్తిలో 30-35% మందికి నైపుణ్యాల పునఃశ్చరణ అవసరమని తెలిపింది. ఆసుపత్రులు, ఆయుష్, వృద్ధుల సంరక్షణ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డయాగ్నొస్టిక్స్, టెలిమెడిసిన్, క్లినికల్ పరిశోధన, పబ్లిక్ హెల్త్ సిస్టమ్స్ వంటి రంగాల్లో నియామకాలు ఎక్కువగా స్పెషలైజేషన్, టెక్నాలజీ నైపుణ్యాలున్న వారికి లభిస్తాయని నివేదిక వివరించింది. 100 మందికి పైగా క్లయింట్ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు అడెక్కో తెలిపింది. విశ్వసనీయ మార్కెట్ పరిశోధన ఆధారాలు కూడా తోడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాల్లో వృద్ధి ఆర్థిక ప్రాబల్యంతో ముడిపడి ఉంటుంది. ఇది 2022లో జీడీపీలో 3.3 శాతంగా ఉండగా.. క్లినికల్ పరిశోధనా కార్యకలాపాలు, డిజిటల్ ఆరోగ్య స్వీకరణ, ఫార్మాస్యూటికల్ అభివృద్ధి, తయారీని ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం అవుట్‌సోర్సింగ్ చేయడం వంటి వాటి మద్దతుతో 2030 నాటికి 5 శాతానికి చేరుకుంటుందని అడెక్కో ఇండియా అంచనా వేసింది. దయాగ్నొస్టిక్స్, ప్రివెంటివ్ హెల్త్‌కేర్, టెలిమెడిసిన్ వంటివి రెండో, మూడో అంచె పట్టణాలకూ విస్తరిస్తుండటంతో వీటికి గిరాకీలో 20-25% పెరుగుదల ఉంటుంది. సంక్లిష్ట జనరిక్స్, స్పెషాల్టీ థెరపీల, బయోలాజిక్స్ వైపు జరుగుతున్న మార్పునకు అనుగుణంగా, అధునాతన ఆర్ అండ్ డీ, రెగ్యులేటరీ ఉద్యోగాల కోసం నియామకాలు 25-30% పెరుగుతాయి. నియామకాల్లో 65-70% బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, చెన్నై, దిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనే కేంద్రీకృతమై ఉంటాయి. ఆసుపత్రి నెట్‌వర్క్‌లు, తయారీ క్లస్టర్‌లు, వికేంద్రీకృత డెలివరీ నమూనాల విస్తరణ మద్దతుతో పుణె, అహ్మదాబాద్, కోయంబత్తూర్ వంటి రెండో, మూడో అంచె నగరాల్లోనూ ఈ నియామకాలు క్రమంగా పెరుగుతున్నాయని అడెక్కో ఇండియా అసోసియేట్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ సేల్స్-పర్మనెంట్ రిక్రూట్‌మెంట్ పీయుష్ సప్రూ వెల్లడించారు.

# రాయల్స్ హ్యాట్రిక్..
# ముంబైపై ఘన విజయం




**గువాహటి :** ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన పోరులో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తద్వారా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో హ్యాట్రిక్ విజయాలతో రాయల్స్ అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 123/9 స్కోరుకు పరిమితమైంది. బర్గర్, బిష్ణోయ్, సందీప్ రెండేసి వికెట్లు తీశారు. టాపార్డర్ త్రయం రోహిత్‌శర్మ(5), రికల్టన్(8), సూర్యకుమార్(6)తో సహా కెప్టెన్ హార్దిక్‌పాండ్యా(9), తిలక్‌వర్మ(14) ఘోరంగా విఫలమయ్యారు. వర్షం అంతరాయం కారణంగా సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. కాగా ప్రత్యర్థి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. 11 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (32 బంతుల్లో 77లి, 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకానికి తోడు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 39, 1 ఫోర్, 5 సిక్స్‌లు) వీరవిహారంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

**దొరికిన బంతిని దొరికనట్టు..**

4, 6, 4, 4, 4.. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్‌కు తొలి ఓవర్లోనే జైస్వాల్ అందించిన ఆరంభమది. 3.2 ఓవర్లకు కుదించిన పవర్ ప్లేలో జైస్వాల్, వైభవ్ కండల్లో కరెంటు నింపుకుని వచ్చినట్టుగా దొరికిన బంతిని దొరికినట్టుగా బౌండరీ లైన్ దాటించడంతో రాయల్స్ రన్‌రేట్ 20కి తగ్గకుండా సాగింది. ఈ మ్యాచ్‌కు ముందు వైభవ్.. బుమ్రాను ఎలా ఎదుర్కుంటాడనేదానిపై అందరూ ఆసక్తిగా ఎదురుచూడగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఈ బీహార్ కుర్రాడు స్టార్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. బుమ్రా, బౌల్ట్‌ను క్లబ్ స్థాయి బౌలర్లుగా మార్చేసి ధనాధన్ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. బుమ్రా బౌలింగ్‌లో తాను ఎదుర్కున్న తొలి నాలుగు బంతుల్లో రెండు భారీ సిక్స్‌లు బాదిన అతడు ఆ తర్వాత బౌల్ట్ ఓవర్లోనూ స్క్వేర్ లెగ్ మీదుగా కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. శార్దూల్ ఐదో ఓవర్లోనూ 6, 4, 6 దంచిన వైభవ్.. ఆఖరి బంతికి ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా భారీ షాట్ ఆడినా అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న తిలక్ వర్మకు చిక్కడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు ఈ జోడీ 4.6 ఓవర్లలోనే 80 రన్స్ జతచేయడం విశేషం. ఆ తర్వాత జురెల్ (2)ను గజన్‌ఫర్ పెవిలియన్‌కు పంపగా హార్దిక్ 8వ ఓవర్లో బౌండరీతో యశస్వీ వరుసగా రెండో ఫిఫ్టీని పూర్తిచేశాడు. రెండు సిక్స్‌లు, ఒక బౌండరీతో ఊపు మీద కనిపించిన కెప్టెన్ పరాగ్ (20)నూ గజన్‌ఫర్ బోల్తా కొట్టించాడు. శార్దూల్ విసిరిన ఆఖరి ఓవర్లో 18 రన్స్ రాబట్టిన జైస్వాల్.. ఇన్నింగ్స్‌కు అదిరిపోయే ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

**ముంబై పోరాడినా..**

11 ఓవర్లలో 151 పరుగుల ఛేదనతో బరిలోకి దిగిన ముంబైకి ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఆర్చర్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ ఆఖరి బంతికి రికల్టన్‌ను ఔట్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. భారీ సిక్స్‌తో దూకుడు మీద కనిపించిన రికల్టన్..మరో షాట్ ఆడే ప్రయత్నంలో కీపర్ చేతికి చిక్కాడు. వచ్చి రావడంతోనే తనదైన శైలిలో సిక్స్ కొట్టిన సూర్యకుమార్ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. బర్గర్ బౌలింగ్‌లో బౌండరీ దగ్గర ఆర్చర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. రెండు పరుగుల తేడాతో రోహిత్‌శర్మ..సందీప్‌శర్మ బౌలింగ్‌లో వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు, బౌలింగ్ మార్పుగా వచ్చిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ మూడు బంతుల వ్యవధిలో హార్దిక్‌తో పాటు తిలక్‌ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ముంబై 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆఖర్లో రూథర్‌ఫర్డ్(25), నమన్ ధీర్(25) దూకుడుగా ఆడినా..ముంబై గెలుపు వాకిట నిలువలేకపోయింది.

## స్పోర్ట్స్

### పాలక్, ముకేశ్‌కు స్వర్ణం.. భారత్ బోణీ



**గ్రానాడ (స్పెయిన్) :** ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ అండ్ పిస్టోల్ వరల్డ్ కప్‌లో భారత్ తొలిరోజే శుభారంభం చేసింది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టోల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత యువ షూటర్లు పాలక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముకేశ్ పసిడి గురిపెట్టారు. ఫైనల్‌లో భారత ద్వయం 487.7 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం గెలుచుకోగా చైనా (484.8)కు రజతం, హంగేరి (414.9) కాంస్యం దక్కించుకున్నాయి. క్వాలిఫికేషన్ రౌండ్‌లో చైనా ద్వయం క్వియాంజు యావొ, కై హు (586)తో పోటీపడి 581 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన భారత జోడీ.. ఫైనల్‌లో మాత్రం సత్తాచాటింది. పాలక్, ముకేశ్ ప్రదర్శన జూనియర్ స్థాయిలో రికార్డు కావడం గమనార్హం.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వార్నర్ అరెస్ట్



**సిడ్నీ :** పరిమితికి మించి మద్యం సేవించి కారు నడిపిన కేసులో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్‌ను ఆస్ట్రేలియా పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్న వార్నర్.. ఏడు రోజులు సెలవు దొరకడంతో స్వదేశానికి వెళ్లాడు. మంగళవారం అతడు మద్యం తాగి కారును డ్రైవ్ చేస్తుండగా మరోబ్ర అనే ప్రాంతలో పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయడంతో ఆ పరీక్షలో అతడికి పాజిటివ్ వచ్చింది. దీంతో వార్నర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత బెయిల్‌పై విడిచిపెట్టారు. త్వరలోనే పాక్‌కు రానున్న వార్నర్.. వచ్చే నెలలో కోర్టుకు హాజరవుతాడని సమాచారం.



## ఒంటికన్ను రాక్షసుడితో మెగా పోరాటం?

అగ్ర హీరో చిరంజీవి నుంచి రానున్న 'విశ్వంభర' సినిమా గురించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. సోషియో ఫాంటసీ అద్భుతంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఒంటికన్ను రాక్షసుడితో చిరంజీవి చేసే యుద్ధం హైలైట్‌గా ఉంటుందట. ఈ యాక్షన్ ఎపిసోడ్‌ని హాలీవుడ్ స్థాయిలో రూపొందించారని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాలోని ప్రధాన ఆకర్షణలో ఈ ఎపిసోడ్ ఒకటని తెలుస్తున్నది. నిజానికి ఈ సినిమా ఈ సమ్మర్‌లోనే విడుదల కావాలి. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం సమ్మర్ రేస్ నుంచి కూడా ఈ సినిమా తప్పుకున్నదని తెలుస్తున్నది. సీజీ వర్క్ బ్యాలన్స్ ఉండటం వల్ల ఇంకాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సమాచారం. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిడి వశిష్ట దర్శకుడు. సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

## నన్ను, నా హీరోయిన్‌ను దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు

విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ చిత్రం 'ఒఎఐ'. ప్రదీప్ రంగనాథన్, కృతీ శెట్టి జంటగా నటించిన ఈ మూవీ ఏప్రిల్ 10 న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది. ఇక విడుదల సమయం దగ్గర పడుతున్న క్రమంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా విఘ్నేశ్ శివన్ ప్రొఫెషనల్ లైఫ్‌తో పాటు పర్సనల్ లైఫ్‌పై కూడా ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'టాప్ లీగ్ డైరెక్టర్‌గా, ప్రతి హీరోకు ఫస్ట్ ఆప్షన్‌గా మారడం నా అతి పెద్ద కల. దాని కోసం నేను నా 100% ఎఫర్ట్ పెడుతున్నాను. మ్యూజిక్ విషయంలో అనిరుధ్ రవిచందర్ అందరికీ ఫస్ట్ ఛాయిస్ అయినట్టు, హీరోయిన్ విషయంలో నయనతారా టాప్‌లో ఉన్నట్టు, డైరెక్టర్స్‌లో ఎస్ఎస్ రాజమౌళి, ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా లాంటి వారు తమ పీక్‌లో ఉన్నట్టు ఒక రోజు నేను కూడా ఆ స్థాయికి చేరుకుంటానని నమ్మకం ఉంది' అని తెలిపారు. అలాగే పర్సనల్ లైఫ్‌పై మాట్లాడుతూ.. 'మన పర్సనల్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే ఏం వస్తుందని కొందరు ప్రశ్నిస్తుంటారు.





## ఆ హీరోయిన్‌పై వస్తున్న వార్తలపై క్లారిటీ ఇచ్చిన అనిల్ రావిపూడి

వరుస బ్లాక్ బస్టర్ హిట్స్‌తో ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. దీంతో ఆయన నుంచి వచ్చే సినిమాల కోసం ఆడియన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈ ఇయర్ మెగాస్టార్ చిరంజీవి మన శంకర వర ప్రసాద్ గారు చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈయన.. ఇప్పుడు మల్టీ స్టారర్ తెరకెక్కించే పనిలో ఉన్నాడు. ఈ మేరకు విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైన్మెంట్‌ను సిద్ధం చేస్తున్నాడు. ఈ కలయికలో సినిమా ప్రకటించినప్పటి నుంచే ఈ ప్రాజెక్టుపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. అంతే కాకుండా ఇందులో నటించే హీరోయిన్స్‌పై ఏదో ఒక న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతూనే ఉంది. ఇందులో భాగంగానే కళ్యాణ్ రామ్ సరసన యంగ్ బ్యూటీ కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. తాజాగా ఒఎఐ ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈ డైరెక్టర్ కృతీ శెట్టిని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'త్వరలో మనం సెట్‌లో కలుద్దాం. ఎలాగో దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇవ్వా?ల్సిన అవసరం లేదు. ఇప్పటికే మనవాళ్లు రాసేశారు' అంటూ చెప్పుకొచ్చాడు. అంటే అనిల్ ప్రాజెక్టులో కృతి భాగం అయినట్లు చెప్పకనే చెప్పేశాడు మన డైరెక్టర్.

## సారా అర్జున్ ఎమోషనల్ పోస్ట్

ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని కలెక్షన్స్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. మార్చి 19న విడుదలైన ఈ చిత్రం తాజాగా భారత బాక్సాఫీస్ వద్ద ?1000 కోట్లు వసూలు చేసిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక ఈ సినిమాపై సక్సెస్‌పై తాజాగా సారా అర్జున్ ఎమోషనల్ నోట్ షేర్ చేసింది. 'నేను ఆదిత్య సార్‌ను మొదటిసారి కలిసినప్పుడు, ఆయన కళ్లలో ఒక ప్రత్యేకమైన మెరుపు కనిపించింది. ఆయన సినిమా కోసం ఏదో అద్భుతం చేస్తారని నాకు అర్థమైంది. ఈ ప్రయాణంలోని ప్రతి అడుగులో నేను ఆ అద్భుతాన్ని గ్రహిస్తూనే ఉన్నాను. అలాగే.. ఈ ప్రయాణంలో మనమందరం గమనించని శక్తులు, ఫ్రేమ్ బయట నిలబడిన అసంఖ్యాకమైన వ్యక్తులు ఈ సక్సెస్‌కు ఒక కారణం. దీంతో పాటు ఈ నౌకకు సారథి అయిన ఆదిత్య ధర్, ఆయన దర్శకత్వ బృందానికి, ఈ కలను ఇంత అద్భుతంగా తెరపైకి తీసుకురావడానికి అవిశ్రాంతంగా పనిచేసిన వారికి, మేము వెలుగులో నిలబడటానికి తుఫానులను తట్టుకున్న నిర్మాతలకు, నిర్మాణ బృందానికి అందరికి ఈ సక్సెస్ అంకితం. ఇంతటి ఆదరణ ఇస్తున్న ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు' అంటూ తెలిపింది సారా.



## ఇకపై సింగిల్‌గానే ఉంటా!

ప్రేమ, పెళ్లి విషయాల్లో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తుంటుంది అగ్ర కథానాయిక శృతిహాసన్. గతంలో డూడుల్ ఆర్టిస్టు శంతను హజారికాతో సుదీర్ఘ ప్రేమాయణం నడిపిందీ భామ. వారిద్దరూ పెళ్లిపీటలెక్కబోతున్నారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే అనంతర పరిణామాల్లో ఈ జంట విడిపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నటనపై దృష్టి పెట్టింది శృతిహాసన్. సెలెక్టివ్‌గా సినిమాల్ని ఎంచుకుంటున్నది. తాజా ఇంటర్వ్యూలో ఆమె తన బ్రేకప్ స్టోరీని పంచుకుంది. తాను ఇప్పటివరకు ఆరుసార్లు విఫల ప్రేమ అనుభవాల్ని చవిచూశానని, వాటివల్ల మానసిక సంఘర్షణకు లోనయ్యానని చెప్పింది. ప్రస్తుతం సినిమాలే ప్రపంచంగా ప్రశాంత జీవితం గడుపుతున్నానని, ఇక మీదట తాను ఒంటరిగానే ఉంటానని శృతిహాసన్ తెలిపింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.





## ఆ హీరోను చూస్తే.. నాకు చాలా అసూయగా ఉండేది

కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొని తోటి నటుడు ప్రశాంత్ ఎదుగుదలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ఇటీవల ఆంధ్రప్రదేశ్ వెళ్ళాను. అక్కడ ఒక చిన్న పల్లెటూరిలో 'యూత్' మూవీ పోస్టర్ చూశాను. ఒక తమిళ సినిమాకు తెలుగులో కూడా ఇంతటి ఆదరణ లభించడం, అక్కడి యువత ఆ చిత్రాన్ని అంతలా ఓన్ చేసుకోవడం చూసి నాకు చాలా గర్వంగా అనిపించింది. దీనికి జీవీ ఒక ముఖ్య ఆధారం. మన సినిమాలు భాషా సరిహద్దులు దాటి వెళ్లడం నిజంగా గొప్ప విషయం" అని సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఒకప్పటి స్టార్ హీరో ప్రశాంత్ గురించి విశాల్ తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "నిజం చెప్పాలంటే, అప్పట్లో నాకు ప్రశాంత్ అంటే చాలా అసూయగా ఉండేది. మా చుట్టూ ఉన్న అమ్మాయిలందరూ అతన్ని ఒక రేంజ్‌లో ఆరాధించేవారు. అతనికి ఉన్న ఫాలోయింగ్ చూసి ముచ్చటగా అనిపించేది. అప్పట్లో ప్రశాంత్‌కు వరుసగా అవకాశాలు వచ్చేవి, పైగా ఆయన వరుసగా సిల్వర్ జూబ్లీ ఘనవిజయం సాధించిన చిత్రాలను అందించారు" అని విశాల్ పేర్కొన్నారు. తన సినీ ప్రయాణం గురించి చెబుతూ.. "ప్రశాంత్ చూడటానికి చాలా అందంగా ఉండేవాడు, అందుకే అతనికి త్వరగా అవకాశాలు వచ్చాయి. కానీ నా రంగు వల్ల నాకు అవకాశాలు రావడానికి చాలా సమయం పట్టింది. చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది" అని విశాల్ తన మనసులోని మాట బయటపెట్టారు. ప్రస్తుతం యువత సినిమాల పట్ల చూపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని విశాల్ అన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com